
సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
బుధవారం, 27.05.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 215
పేజీలు: 08 వెల: రూ. 5

# రుతుపవనాల రాక ఆలస్యం..
## మరికొన్ని రోజులు మంట తప్పదా!



- వడగాల్పులతో తెలంగాణ విలవిల!
- ఎల్‌నినో ప్రభావంతో ఈసారి లోటు వర్షపాతం!
- పలుచోట్ల 46 డిగ్రీలు దాటిన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

**ముద్ర డెస్క్ :**
ఈ ఏడాది భారత్‌లో పలు రాష్ట్రాల్లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని కొన్ని రోజుల కిందట ఐఎండీ తెలిపింది. అయితే ఈ ఏడాది వానాకాలం ఆలస్యంగా ప్రారంభం కానుంది. నైరుతి రుతుపవనాలు జూన్ ఐదో తేదీ తర్వాతే తెలంగాణ రాష్ట్రాన్ని తాకే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. దేశ దక్షిణ ప్రాంతాన్ని మే 25 నాడే తాకుతాయని తొలుత అంచనా వేశారు. కానీ ఎల్‌నినో (El Nino) పరిస్థితుల కారణంగా నైరుతి రుతుపవనాల కదలికల్లో వేగం తగ్గిందని అధికారులు తెలిపారు.
హిందూ మహాసముద్రం, బంగాళాఖాతంలో విస్తరిస్తూ వచ్చిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం శ్రీలంక సగం వరకు వచ్చి నిలిచిపోవడంతో ఆలస్యం కానుంది. సాధారణంగా మే చివరికల్లా తెలంగాణను తాకాల్సిన రుతుపవనాలు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో జూన్ 5 నుంచి 10వ తేదీ మధ్య వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ కారణాలతో ఈ ఏడాది సాధారణం కంటే వర్షపాతం తక్కువ నమోదయ్యే ప్రమాదం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లోనూ వర్షాలపై ప్రభావం పడుతుందని తెలుస్తోంది. మిగతా 02లో

# కేంద్రమంత్రివర్గంలో భారీ మార్పులు?
## మాజీ సీఎంలకు ఢిల్లీ పిలుపు..



- జూన్ 10లోపు విస్తరణకు మోదీ మాస్టర్ ప్లాన్!
- సంచలన మార్పులు ఉంటాయని సంకేతాలు
- కొంత మంది సీఎంలను కేంద్రమంత్రుల్ని చేసే అవకాశం
- ఢిల్లీ పొలిటికల్ సర్కిళ్లలో ముగ్గురు మాజీ సీఎంల పేర్లు
- అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు అత్యంత ప్రాధాన్యం
- ప్రస్తుత పోర్ట్ పోలియోలలోనూ మార్పులుండే చాన్స్
- జూన్ 10లోపు ముగియనున్న విస్తరణ ప్రక్రియ
- ఊహించని వారి పేర్లు తెరపైకి వస్తాయనే ఆశలు
- ఎవరెవరికి బెర్తులు దక్కుతాయోనని ఎంపీలలో ఉత్కంఠ

**ముద్ర డెస్క్ :**
దేశ రాజకీయాల్లో మరోసారి కేంద్ర మంత్రివర్గ విస్తరణ అంశం హాట్ టాపిక్‌గా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మోదీ 3.0 ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, పాలనలో కొత్త ఉత్సాహం నింపేందుకు, ప్రభుత్వ పనితీరుకు మరింత వేగం తీసుకురావేందుకు, అలాగే 2029 సాధారణ ఎన్నికలకు ముందుగానే పార్టీని సమాయత్తం చేసేందుకు భారీ స్థాయిలో మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నారనే ప్రచారం ఢిల్లీ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా ఈసారి జరిగే విస్తరణలో పలువురు మాజీ ముఖ్యమంత్రులకు కేంద్ర కేబినెట్‌లో చోటు దక్కబోతోందన్న వార్తలు సంచలనం రేపుతున్నాయి.
ఇప్పటికే మాజీ సీఎంలైన శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్ ఖట్టర్ వంటి నేతలు కేంద్ర కేబినెట్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తుండగా, మరో ఇద్దరు లేదా ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులను ఢిల్లీ రాజకీయాల్లోకి తీసుకురావాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నట్టు సమాచారం. వీరికి కేబినెట్ హోదాతో కీలక శాఖలను అప్పగించే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవలే పదవికి రాజీనామా చేసిన బీహార్ నాయకుడు నితీష్ కుమార్ పేరు కూడా ఈ జాబితాలో ముఖంగా వినిపిస్తుండటం ఆసక్తిని పెంచుతోంది. అంతే కాకుండా, ప్రస్తుతం ముఖ్యమంత్రులుగా కొనసాగుతున్న కొందరు నేతలను కూడా రాష్ట్రాల నుంచి ఢిల్లీకి తీసుకువచ్చే అవకాశాలపై చర్చ నడుస్తోంది.

**'మిడ్ టర్మ్ రీసెట్'గా విశ్లేషణ**
2026, మే నెలలో చేపట్టబోయే ఈ మార్పులను రాజకీయ విశ్లేషకులు 'మిడ్ టర్మ్ రీసెట్'గా అభివర్ణిస్తున్నారు. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది తొలి భారీ రాజకీయ పునర్వ్యవస్థీకరణగా భావిస్తున్నారు. ఇప్పటివరకు పనితీరు ఆశించిన స్థాయిలో లేని కొందరు మంత్రులను పక్కనబెట్టి, కొత్త ఉత్సాహంతో పనిచేసే నేతలకు అవకాశం కల్పించాలనే ఆలోచనతోనే ఈ విస్తరణకు రూపకల్పన జరుగుతోందని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.
ఇక కేవలం సీనియర్ నేతలకే కాకుండా, యువతలో మంచి ఇమేజ్ ఉన్న నేతలకు కూడా ఈసారి పెద్దపీట వేయనున్నట్టు సమాచారం. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరిపాలనలో తమ ముద్ర వేసిన యువ నాయకులను కేంద్ర కేబినెట్‌లోకి తీసుకురావడం ద్వారా పార్టీకి కొత్త శక్తిని తీసుకురావాలని మోదీ, అమిత్ షా జంట భావిస్తున్నట్టు తెలుస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆయా రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారనే మిగతా 02లో



## మజ్లిస్ ఒత్తిడితో మూడు ముక్కలు
**కాంగ్రెస్ పాలకులపై బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు ఫైర్**

- డివిజన్ల ఏర్పాటుపై అధికారులకు క్లారిటీ లేదు
- హైదరాబాద్ సమస్యలను పరిష్కరించడంలో ఫెయిల్
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పేదలను మోసం చేశాయి
- బీజేపీతోనే భాగ్యనగరం విశ్వనగరం

03

## ఖబర్దార్ కొప్పుల ఈశ్వర్..
**నోరుందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు**



- ప్రజల మధ్య ఉంటున్న ప్రజా ప్రతినిధిని నేను
- మాజీ మంత్రి కొప్పుల పై మంత్రి అడ్లూరి ఫైర్

03

## ధాన్యం కొనుగోలులో రాష్ట్రం విఫలం
**రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన**




- ప్రతిపైసా కేంద్రమే ఇస్తున్నా.. ఎందుకీ వైఫల్యం
- వడ్ల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తి మాత్రమే
- ఇకనైనా బేషజాలకు పోకుండా ప్రతి గింజను కొనుగోలు చేయండి
- జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని రైతుల ఇబ్బందులను తీర్చండి

04

# తొలిసారిగా రెడ్ అలర్ట్
## వడదెబ్బతో తెలంగాణలో 54 మంది, ఏపీలో 18 మంది మృతి..

- తెలుగు రాష్ట్రాల్లో 72 మంది
- తెలంగాణలో తొలిసారి రెడ్ అలర్ట్..
- 48 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ఎండ దెబ్బకు పిట్టల్లా రాలిపోతున్న ప్రాణాలు
- 115 మండలాల్లో 44 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు
- బయట అడుగు పెడితే ముప్పు.. వాతావరణ శాఖ హెచ్చరిక

**ముద్ర డెస్క్ :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భానుడి భగభగలు ఏ మాత్రం తగ్గడం లేదు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటం ప్రజలి భయాందోళనకు గురిచేస్తోంది. సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదైనట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. తీవ్రమైన ఈ ఎండ వేడిమికి, వడదెబ్బకు గురై రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో మొత్తం 18 మంది మృత్యువాత పడటం విషాదాన్ని నింపింది. అటు తెలంగాణలోనూ సోమవారం ఒక్కరోజే 54 మంది మృతిచెందారు.
ముఖ్యంగా కృష్ణా జిల్లాలోని కంకిపాడు, పెనమలూరు ప్రాంతాలలో గరిష్ఠంగా 48.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై ప్రజలను నరకప్రాయం చేసింది. అలాగే బాపట్ల జిల్లా కూచినపూడిలో 46.4 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. మిగతా 02లో



## బండి భగీరథ్‌కు కస్టడీ
మూడు రోజుల పాటు విచారించనున్న పోలీసులు!



- భగీరథ్ కస్టడీతో కీలక ఆధారాల వేట
- థర్డ్ డిగ్రీ వద్దు.. వైద్య పరీక్షలు తప్పనిసరి అంటూ కోర్టు ఆదేశాలు
- రాజకీయంగా సెన్సిటివ్‌గా మారిన పాక్సో కేసు..
- భగీరథ్ కస్టడీపై ఉత్కంఠ పెరుగుతోంది

03

## 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' ముగింపు వేడుకలు

- ఇంటింటి సర్వేతో 'ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా'
- సర్వే పూర్తయిన ఇళ్లకు ప్రత్యేక లోగో స్టిక్కర్లు
- డిప్యూటీ సీఎం భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయం

02



## రంజుగా ప్లేఆఫ్స్
**20 ఓవర్లలో 254 భారీ స్కోరు చేసిన ఆర్సీబీ**

- 33 బంతుల్లో 93 పరుగులతో రెచ్చిపోయిన పటీదార్
- నేడు ఐపీఎల్ లో మ్యాచ్

04



## బంగ్లాదేశీయులపై బెంగాల్ యాక్షన్
అక్రమ వలసదారులకు సీఎం సువేందు హెచ్చరిక



- వెళ్లగొట్టకముందే పారిపోండి
- చొరబాటుదారులపై ఉక్కుపాదం
- నిర్బంధ కేంద్రాలతో కఠిన చర్యలు

04

## ఆర్టీసీ డ్రైవర్ సస్పెండ్
**పెట్రోల్ డీజిల్ కాదని, వడ్లు కొనాలని కామెంట్**



- సోషల్ మీడియాలో వైరల్ అయిన కామెంట్
- కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో సస్పెండ్

03

## ఉప్పల్‌లో రాజకీయ వేడి
కాంగ్రెస్ – బీఆర్ఎస్ మధ్య ప్రచార పోరు



- డిగ్రీ కాలేజీ అంశంపై రాజకీయం రగులుతోంది
- అభివృద్ధి క్రెడిట్ కోసం ఇరు పార్టీల మాటల యుద్ధం
- సోషల్ మీడియాలో విమర్శలు.. ఉప్పల్ రాజకీయాల్లో వేడి
- ఇళ్ల హామీలు, అభివృద్ధిపై పరస్పర ఆరోపణలు



02

**ఇదీ AI ముద్ర**



### టీ మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలు



ఎసిడిటీ దూరం: టీ తాగడం మానేస్తే గుండెల్లో మంట, కడుపు ఉబ్బరం వంటి ఎసిడిటీ సమస్యలు పూర్తిగా మాయమవుతాయి. ఇది జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచి, కడుపును ప్రశాంతంగా ఉంచుతుంది.

# తొలిసారిగా రెడ్ అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని మొత్తం 14 జిల్లాల పరిధిలో ఉన్న 115 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వడదెబ్బతో మరణించిన వారిలో ఎన్టీఆర్ జిల్లా జుజ్జూరుకు చెందిన కోపూరి మోషే (70), కొండపల్లికి చెంది న బుస్సా చిట్టెమ్మ (80), విజయవాడ మొగల్రాజపురానికి చెందిన గొంగటి చంటి (45), వావిలాలకు చెందిన షేక్ నాగుల్ మీరా (52) ఉన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరుకు చెందిన షేక్ మౌలాలి (42), తెన్నేరుకు చెందిన తా ళ్లూరి విజయ్ (40)తో పాటు గుంటూ రు జిల్లా ప్రాతూరు రోడ్డులో ఓ గుర్తుతెలియని వ్యక్తి (55) వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయారు.

**మధ్య వయస్కులలోనూ మరణాలు**

ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లోనూ మరణాలు సంభవించాయి. కాకినాడ రూరల్ కూరాడకు చెందిన టేకుమూడి సూర్యనారాయణ (80), మూలపేటలో ఒక వ్యక్తి (30), చినజగ్గంపేటలో ఆచార్యులు (85) మరణించారు. అనకాపల్లి జిల్లా వేంపాడులో ఓ యాచకురాలు (70), డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం చిన్నపేటకు చెందిన ఇసుకపట్ల బుజ్జిబాబు (43), పి గన్నవరంలో ఒక వృద్ధుడు, యర్రంశెట్టివారిపాలేనికి చెందిన కొండేటి చినసత్యవతి (59) వడదెబ్బకు బలయ్యారు. పల్నాడు జిల్లా కట్టావారిపాలేనికి చెందిన చవల తిరుపతమ్మ, కోనసీమ జిల్లా అనాతవరానికి చెందిన జంగం శివనాగేశ్వరరావు, పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన పి.నాగఅప్పారావు (45)లతో పాటు, ఏలూరు జిల్లా కొర్రగుంటపాలేనికి చెందిన 104 ఏళ్ల వృద్ధురాలు కొండూరి అనసూర్యమ్మ కూడా ఈ ఎండ తీవ్రతకు చనిపోయారని సమాచారం.

**తెలంగాణలో తొలిసారిగా అలర్ట్**


తెలంగాణలో ఎండల తీవ్రత రికార్డు స్థాయికి చేరి నిప్పుల కొలిమిని తలపిస్తోంది. భానుడి భగభగలకు తోడు అసాధారణంగా వీస్తున్న తీవ్ర వడగాల్పులతో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. రాష్ట్రంలో మరో 4 రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న రోజుల్లో అత్యంత ప్రమాదకర స్థాయిలో వడగాల్పులు వీచే ఆస్కారం ఉన్నందున వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. వడగాల్పుల తీవ్రతపై రాష్ట్రంలో ఇలాంటి ముందస్తు హెచ్చరిక జారీ కావడం ఇదే మొదటిసారి.

**వడదెబ్బతో 54 మంది మృతి**

తీవ్రమైన ఎండలు రాష్ట్రంలో పెను విషాదాన్ని నింపుతున్నాయి. సోమవారం ఒక్క రోజే వడదెబ్బకు గురై రాష్ట్రవ్యాప్తంగా 54 మంది ప్రాణాలు కోల్పోయారు. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 17 మంది మృతి చెందగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 14 మంది మృతి చెందారు. కరీంనగర్‌లో ఏడుగురు, నల్గొండలో ఆరుగురు, ఆదిలాబాద్‌లో ఐదుగురు, నిజామాబాద్‌లో ఇద్దరు, మహబూబ్‌నగర్, సిద్దిపేట జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌కు చెందిన ఆటో డ్రైవర్ అహ్మద్ ఆరిఫ్ (50) ఎండ తీవ్రత తట్టుకోలేక తన ఆటోలోనే సేదతీరుతూ వడదెబ్బతో అక్కడికక్కడే కన్నుమూయడం తీవ్రంగా కలచివేసింది.

**ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్**

ముఖ్యంగా పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అతితీవ్ర వడగాల్పులు వీచే ప్రమాదం ఉన్నందున ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. వీటితో పాటు కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ వంటి మరో ఎనిమిది జిల్లాల్లో తీవ్రత ఎక్కువగా ఉంటుందని పేర్కొంటూ ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అలాగే నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాలకు సైతం ఎల్లో అలర్ట్ అలర్ట్ జారీ చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.



# కేంద్రమంత్రివర్గంలో భారీ మార్పులు?



(మొదటి పేజీ తరువాయి)

ప్రచారం కూడా సాగుతోంది. ప్రస్తుతం బీజేపీకి దక్షిణాది రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో బలం లేకపోవడంతో, ఆ ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేయడానికి ఈసారి కేబి నెట్ విస్తరణను వ్యూహాత్మకంగా వినియోగించుకోవాలని బీజేపీ హైకమాండ్ భావిస్తు న్నట్టు సమాచారం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన నేతలకు ప్రాధాన్యం పెరిగే అవకాశముందని ఢిల్లీ రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు ఉపయోగపడే సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని కొత్త ముఖాలను ఎంపిక చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

**కీలక శాఖల్లో మార్పుల చర్చ**

ప్రస్తుతం కొందరు కేంద్ర మంత్రులు రెండు, మూడు శాఖలను నిర్వహిస్తున్న నేపథ్యం లో, అదనపు బాధ్యతలను తగ్గించి ఒక్కో శాఖకు ప్రత్యేక మంత్రిని నియమించేలా ప్ర ణాళిక సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. రక్షణ, హోంశాఖ, ఆర్థిక శాఖల వంటి అత్యంత కీలక మంత్రిత్వ శాఖల్లో పెద్దగా మార్పులు ఉండకపోవచ్చని చెబుతున్నప్పటికీ, రైల్వే, ఐటీ, పౌర విమానయాన, విద్య, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్య శాఖల్లో మార్పులు ఖాయ మనే ప్రచారం వినిపిస్తోంది. కొన్ని శాఖల్లో పనితీరుపై అసంతృప్తి వ్యక్తం అవుతున్న నేపథ్యంలో కొత్త నాయకత్వాన్ని తీసుకురావాలనే ఆలోచన ఉన్నట్టు తెలుస్తోంది.

**జూన్ 10లోపు పూర్తి?**

మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సం దర్భంగా జూన్ 10లోపే మంత్రివర్గ విస్తరణ ప్రక్రియను పూర్తి చేయాలని బీజేపీ అధి ష్ఠానం లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. ఇప్పటికే పలువురు ఎంపీల పనితీరు, రాష్ట్రాల రాజకీయ పరిస్థితులు, కుల సామాజిక సమీకరణాలు, ఎన్నికల వ్యూహాలు వంటి అంశాలపై విస్తృతంగా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నట్టు తెలుస్తోంది. ఎవరికీ పదోన్నతి దక్కుతుంది? ఎవరికి ఉద్వాసన పలుకుతారు? ఏ రాష్ట్రానికి ఎంత ప్రాధాన్యం లభిస్తుంది? అనే అంశాలపై ఇప్పుడు బీజేపీ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఈ సారి మోదీ కేబినెట్ విస్తరణలో 'సర్‌ప్రైజ్ ఎలిమెంట్స్' ఖచ్చితంగా ఉంటాయని, ఇప్పటి వరకు ఎవరూ ఊహించని పేర్లు కూడా తెరపైకి వచ్చే అవకాశముందని ఢిల్లీ రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో కేంద్ర రాజకీయాల్లో వచ్చే రెండు వారాలు అత్యంత ఆసక్తికరంగా మారనున్నాయి.

# 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' ముగింపు వేడుకలు



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా ప్రణాళిక కార్యక్రమం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా జూన్ 2 నుండి 12 వరకు రాష్ట్ర వ్యాప్తంగా "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాలను వైభవంగా నిర్వహించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. గ్రామ సభ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాల ప్రగతిని సమీక్షించిన కేబినెట్ సబ్ కమిటి రాబోయే రోజుల్లో ప్రజా భాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కమిటీ అధికారులను ఆదేశించింది. ముఖ్యంగా 'పర్యావరణ వారోత్సవం', రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాల వ్యతిరేక ప్రచారం, మహిళా-శిశు రక్షణ, గృహ నిర్మాణం, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, పునర్వినియోగ శక్తి (గ్రీన్ ఎనర్జీ) ప్రాజెక్టుల అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని భట్టి విక్రమార్క నిర్దేశం చేశారు. ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.

**ప్రతి కుటుంబానికి 'ఇందిరమ్మ బీమా' రక్షణ**

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ కుటుంబ జీవితం బీమా' పథకం అమలుపై కేబినెట్ సబ్ కమిటి సుదీర్ఘంగా చర్చించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పునరుద్ఘాటించారు.

**బీమా పథకం కీలక నిర్ణయాలు**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇల్లు కవర్ అయ్యేలా సమగ్ర గృహ స్థాయి డేటా సేకరణ జరపాలి. ఒకవేళ ఎవరైనా మిగిలిపోతే వారి కోసం ప్రత్యేక శిబిరాలు (స్పెషల్ క్యాంపులు) ఏర్పాటు చేయాలి. పథకం ప్రయోజనాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన 'లోగో'ను రూపకల్పన చేయనున్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికి ఈ లోగోతో కూడిన స్టిక్కర్లను అతికించనున్నారు. ఈ మేరకు అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను (యాక్షన్ ప్లాన్) వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ రావు అధికారులను ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, డిజిపి సి.వి ఆనంద్, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, వికాస్ రాజు, నవీన్ మిత్తల్, వాణి ప్రసాద్, దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీలు సందీప్ కుమార్ సుల్తానీయా, గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# రుతుపవనాల రాక ఆలస్యం..

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం, గురువారాల్లో తెలంగాణలో భానుడి భగభగలు ఇలాగే కొనసాగుతాయని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఎండ తీవ్రత అధికంగా ఉండటం, ప్రజలు వడదెబ్బతో అధిక సంఖ్యలో చనిపోతుండటంతో కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు,



ఖమ్మం జిల్లాలకు రెడ్ అలర్ట్' జారీ చేయగా, అక్కడ 45 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ముఖ్యంగా కొన్ని జిల్లాల్లో వడగాలులు వీస్తున్నందున ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఎన్నో కుటుంబాలలో ఎండ తీవ్రత, వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో ద్రోణి కారణంగా కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మరోవైపు నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రం నిప్పుల కుంపటిలా మారింది. ఏపీలో సోమ వారం ఒక్కరోజే 18 మంది చనిపోగా, తెలంగాణలో 54 మంది వడదెబ్బ, ఎండ తీవ్రత కారణంగా చనిపోయారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 46 డిగ్రీల పైన, మరో 6 జిల్లాల్లో 45.2 నుంచి 45.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 16 జిల్లాల్లోని 145 మండలాల్లో తీవ్ర వడగాలులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 19 మండలాలు, మంచిర్యాలలో 17 మండలాల్లో, సూర్యాపేటలో 14, ఖమ్మంలో 13 మండలాలతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాలు ప్రజలు ఎండ వేడికి తట్టుకోలేకపోతున్నారు.



# ఉప్పల్‌లో రాజకీయ వేడి

**ముద్ర, కాప్రా:** ఉప్పల్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం రోజురోజుకీ వేడెక్కుతోంది. ఒకవైపు బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వర్గం మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి వర్గం పరస్పర ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీయ వేడిని పెంచుతున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు తీవ్ర వ్యాఖ్యలు చేసుకుంటూ ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి.

తాజాగా ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు అంశం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ వర్గం చెబుతున్న ప్రకారం.. ఉప్పల్ బాగాయత్ హెచ్ఎండిఏ లేఔట్‌లో 5 ఎకరాల ప్రభుత్వ భూమిని డిగ్రీ కళాశాలకు కేటాయించాలని కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి విజ్ఞప్తి చేయగా, మేడ్చల్ జిల్లా కలెక్టర్ హెచ్ఎండిఏ అధికారులకు లేఖ రాశారని పేర్కొంటున్నారు. అదే అంశంపై పరమేశ్వర్ రెడ్డి కలెక్టర్‌ను కలిసి కళాశాల ఏర్పాటు ప్రక్రియపై చర్చించినట్లు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. అయితే దీనిపై బీఆర్ఎస్ వర్గం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. "ప్రతి చిన్న విషయాన్నీ తమ వల్లే జరిగిందని చెప్పుకోవడం ప్రజలను తప్పుదారి పట్టించడం" అని ఆరోపిస్తోంది. డిగ్రీ కళాశాల ఎప్పుడు వస్తుంది? ఎంత నిధులు మంజూరయ్యాయి? నిర్మాణ గడువు ఏమిటి? వంటి ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా కేవలం ఫోటోలు, ప్రెస్ నోట్లు మాత్రమే విడుదల చేస్తున్నారని విమర్శిస్తోంది.

ఇక అభివృద్ధి పనుల విషయంలో కూడా ఇరు వర్గాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. చెరువుల అభివృద్ధి, రోడ్లు, మౌలిక వసతులు, ఎంఎంసి భవనం నిర్మాణం వంటి అంశాల్లో క్రెడిట్ కోసం కాంగ్రెస్ – బిఆర్ఎస్ మధ్య పోటీ నెలకొంది. టిఆర్ఎస్ నాయకులు "ఉప్పల్ అభివృద్ధికి పునాది మా ప్రభుత్వ హయాంలో పడింది" అంటుండగా.. కాంగ్రెస్ నాయకులు మాత్రం "ప్రస్తుత ప్రభుత్వం భారీ నిధులు తీసుకొచ్చి అభివృద్ధిని వేగవంతం చేస్తోంది" అని చెబుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల హామీ కూడా ఇప్పుడు రాజకీయ చర్చకు దారి తీసింది. కాంగ్రెస్ పార్టీ అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తామని చెబుతుండగా.. ఎమ్మెల్యే వర్గం మాత్రం "గత హామీల పరిస్థితి ఏమైందో ముందుగా చెప్పాలి" అని ప్రశ్నిస్తోంది. అంతేకాదు.. సోషల్ మీడియాలో "పిచ్చి రాతలు, కాకి కూతలు" వంటి పదజాలంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ప్రజల హక్కు అని టిఆర్ఎస్ చెబుతుండగా.. అభివృద్ధి కార్యక్రమాలు చేస్తే ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ మండిపడుతున్నారు.

# అస్సాం అడవుల్లో శ్వేత వర్ణంలో జంతువు..

**ముద్ర డెస్క్ :** అది దట్టమైన అడవి.. మండు వేసవిలో కూడా పచ్చగా కనిపిస్తోంది. అటువంటి అడవిలో ఒక శ్వేత వర్ణంలో ఉన్న జంతువు కనిపించింది. ఆ జంతువు కాస్త అడవిలో స్వేచ్ఛగా తిరగడం మొదలుపెట్టింది. పచ్చని గడ్డిని ఆరగించడం ప్రారంభించింది. ఆ జంతువు గెంతుతూ సందడి చేస్తున్న దృశ్యాలు అడవిలో ఏర్పాటుచేసిన సీక్రెట్ కెమెరాలో రికార్డైంది. దీంతో ఒక్కసారిగా చర్చ మొదలైంది.



మనదేశంలోని ఈశాన్య రాష్ట్రాలలో ప్రముఖమైనది అస్సాం. ఇక్కడ కజరంగ నేషనల్ పార్క్ ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ఈ పార్కులో ఖడ్గమృగాలనుంచి మొదలు పెడితే పులుల వరకు ఉంటాయి.. విస్తారంగా అడిగి ఉండడంతో జీవ వైవిధ్యం కూడా మెరుగ్గా ఉంటుంది. పైగా ఇక్కడ జంతువులకు ఆహారం సమృద్ధిగా లభిస్తూ ఉంటుంది. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో అరుదైన జంతువులను అనేకం కనుగొన్నారు. కానీ ఇంతవరకు శాస్త్రవేత్తలకు.. పర్యావరణవేత్తలకు కనిపించని ఒక జంతువు.. కెమెరాలలో రికార్డు అయింది. ఆ జంతువు పేరే ఆల్ బినో హాగ్ డీర్. దీనిని శ్వేత వర్ణ జింక అని పిలుస్తుంటారు. దాని నేత్రాలు అత్యంత విశాలంగా ఉన్నాయి. కొమ్ములు కూడా నిటారుగా ఉన్నా యి. దాని చూపు అత్యంత పారదర్శకంగా ఉంది. అది వేగంగా పరుగులు పెడుతూ ఉంది. మిగతా జింకలతో పోల్చి చూస్తే అది అత్యంత బలిష్టంగా ఉంది. శ్వేత వర్ణంలో ఉన్న జింకను చూడటం ఇదే తొలిసారి అని కజిరంగా నేషనల్ పార్క్ సిబ్బంది చెబుతున్నారు.

అస్సాం ముఖ్యమంత్రి హిమంత ఈ వీడియోను తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శ్వేత వర్ణంలో జింక కనిపించడం అస్సాం రాష్ట్రం ఘనతకు గర్వకారణమని పేర్కొన్నారు. కజిరంగా నేషనల్ పార్కులో ఇటువంటి అద్భుతాలు ప్రతి రోజు కనిపిస్తాయని ఆయన చెప్పుకొచ్చారు. ఇవన్నీ కూడా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఫలితం అని ఆయన వెల్లడించారు. ఇటువంటి అరుదైన జంతువులను కాపాడేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన వెల్లడించారు. అయితే ఈ శ్వేత వర్ణంలో ఉన్న జింక ఇక్కడికి ఎలా వచ్చింది.. జింకలలో ఏవైనా జన్యుపరమైన మార్పులు చోటు చేసుకుంటే పుట్టిందా.. లేదా ఏదైనా అద్భుతం జరిగిందా.. అనే కోణాలలో శాస్త్రవేత్తలు పరిశీలన జరుపుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
బుధవారం 27.05.2026
www.mudranews.in | @mudranews



**టీ మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలు :**



పోషకాల లభ్యత : టీని దూరం పెట్టడం వల్ల మనం తినే ఆహారంలోని కాల్షియం, ఐరన్, విటమిన్లను శరీరం నేరుగా గ్రహించగలుగుతుంది. దీనివల్ల శరీరానికి పూర్తిస్థాయిలో పోషకాలు అంది, ఎముకలు మరింత బలంగా మారుతాయి.

# పోలీసు కస్టడీకి బండి భగీరథ్

**మూడు రోజుల పాటు విచారించనున్న పోలీసులు**

**థర్డ్ డిగ్రీ వద్దు.. వైద్య పరీక్షలు తప్పనిసరి అంటూ కోర్టు ఆదేశాలు**



**ముద్ర, డెస్క్ :** సంచలనం సృష్టించిన పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో భగీరథ్‌ను మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పోలీసులు వేసిన పిటిషన్‌ను కోర్టు సమర్థించింది. నిందితుడిని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. బండి భగీరథ్‌పై నమోదైన తీవ్రమైన ఆరోపణల కారణంగా మరిన్ని ఆధారాలు సేకరించడానికి పోలీసులు కస్టడీని కోరారు. ఈ మూడు రోజుల వ్యవధిలో ఘటన జరిగిన తీరు, ఇతరుల ప్రమేయం, సాంకేతిక ఆధారాలపై పోలీసులు దృష్టి సారించనున్నారు. ఇప్పటికే బాధితురాలి నుంచి సేకరించిన స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిని ప్రశ్నించి, కీలక విషయాలను వెలికితీయాలని దర్యాప్తు సంస్థ భావిస్తోంది. కోర్టు ఆదేశాల ప్రకారం బుధవారం నుంచి భగీరథ్‌ను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. విచారణ సమయంలో నిందితుడిపై ఎటువంటి ఒత్తిడి గానీ, థర్డ్ డిగ్రీ గానీ ఉపయోగించకూడదని కోర్టు నిబంధనలు విధించింది. అలాగే ప్రతిరోజూ విచారణ ముగిసిన తర్వాత వైద్య పరీక్షలు నిర్వహించి, నివేదికను సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ విచారణలో వెల్లడయ్యే అంశాలు కేసు తుది తీర్పులో అత్యంత కీలకం కానున్నాయి. మరోవైపు ఈ కేసు రాజకీయంగా కూడా సున్నితమైనది కావడంతో పోలీసులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరి స్తున్నారు. కస్టడీ సమయంలో భగీరథ్‌కు సంబంధించిన మొబైల్ డేటా, కాల్ రికార్డ్స్, సోషల్ మీడియా కార్యకలాపాలను కూడా నిశితంగా పరిశీలించే అవకాశం ఉంది. ప్రస్తుతం భగీరథ్ చర్లపల్లి జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కస్టడీ గడువు ముగిసిన తర్వాత తిరిగి ఆయనను కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసు కావడంతో పోలీసులు అత్యంత పకడ్బందీగా ఛార్జ్ షీట్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

### మజ్లిస్ ఒత్తిడితో

# హైదరాబాద్ ను మూడు ముక్కలు చేశారు

**బీజేపీ రాష్ట్ర చీఫ్ రాంచందర్ రావు**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మజ్లిస్ ఒత్తిడితో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ను మూడు ముక్కలు చేశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. హైదరాబాద్ లో డివిజన్ల ఏర్పాటుపై ఇప్పటికీ అధికారులకు ఒక క్లారిటీ లేదని చెప్పారు. మంగళవారం కూకట్ పల్లోని బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ప్రజాసమస్యలను కాంగ్రెస్ నేతలు పక్కదారి పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ కు మజ్లిస్ ముఖ్యం కానీ, హైదరాబాద్ ప్రజలు ముఖ్యం కాదని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో కాలుష్య నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో కాంగ్రెస్ సర్కార్ ప్రజలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా హైదరాబాద్ లోని పేద ప్రజలకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. కేసీఆర్ హయాంలో రియల్ ఎస్టేట్ పేరుతో జేబులు నింపుకున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రియల్ ఎస్టేట్ రంగం కుదేలయ్యిందని అన్నారు. భాగ్యనగరంలో చిన్న వాన పడితే.. నగరం మునిగిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భాగ్యనగరాన్ని విశ్వనగరంగా బీజేపీ మాత్రమే మార్చగలదని వ్యాఖ్యానించారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మజ్లిస్, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. తెలంగాణలో అవినీతి రహితమైన పరిపాలనను బీజేపీ మాత్రమే అందిస్తుందని రామచందర్ రావు పేర్కొన్నారు.

# హత్యకేసులో 5 గురు నిందితుల అరెస్ట్

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నరసింహ**




**ముద్ర ప్రతినిధి, సూర్యాపేట:** సూర్యాపేట రూరల్ పరిధిలోని సోలిపేట గ్రామ శివారులో మేకల జయరాములు హత్య కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను పోలీసులు 12 గంటల్లో అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను ఎస్పీ మీడియాకు వెల్లడించారు. మృతుడు జయరాములు గతంలో పిల్లల చదువుల నిమిత్తం సూర్యాపేటలో నివసిస్తూ, తనకు వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల భూమిని తన తమ్ముడు కృష్ణయ్యకు కౌలుకు ఇచ్చాడు. అనంతరం గ్రామానికి తిరిగి వచ్చి తన భూమిని తానే సాగు చేసుకుంటుండటంతో కుటుంబ సభ్యుల మధ్య భూమి గట్టు, ఇంటి హద్దుల విషయంలో తరచూ వివాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో కృష్ణయ్య కుమారుడు కిరణ్, అతని భార్య మౌనిక, కృష్ణయ్య, లక్ష్మమ్మ, మరో వ్యక్తి రామచంద్రులు కలిసి జయరాములుపై కక్ష పెంచుకున్నారు. ఇటీవల వ్యవసాయ భూమిలో బోర్ వేయడం, మోటార్ అమర్చిన సందర్భంగా పొలంలో దావత్ చేసుకుంటుండగా అక్కడికి వచ్చిన జయరాములును హత్య చేయాలని పథకం రచించినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం సాయంత్రం జయరాములు తన పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గ్రామ ఆర్చ్ వద్ద కిరణ్, మౌనికలు అడ్డగించి గొడ్డలితో దాడి చేశారు. మెడ, తల, చేతులపై తీవ్రంగా నరికి హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం నిందితులు గ్రామం నుంచి పరారయ్యారు. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు హైటెక్ బస్టాండ్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా, భూమి గట్టు వివాదం కారణంగానే హత్య చేసినట్లు అంగీకరించారు. వారినుంచి ఒక స్కూటర్, నాలుగు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు.కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కేసును సమర్థంగా దర్యాప్తు చేసిన డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలు నాయక్, సూర్యాపేట రూరల్ పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ఖబర్దార్ కొప్పుల ఈశ్వర్..

**నోరు ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దు**

**ప్రజల మధ్య ఉంటున్న ప్రజా ప్రతినిధిని నేను**

**మాజీ మంత్రి కొప్పుల పై మంత్రి అడ్లూరి ఫైర్**




**ముద్ర, ధర్మారం:** నోరు ఉందని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ప్రజల కోసం పనిచేస్తున్న తనపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండిపడ్డారు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి అట్లూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యులపై మోయలేని భారం పడుతుందని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సంక్షేమాన్ని మరిచిపోయారని మంత్రి అడ్లూరి అన్నారు. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా భవన్ నిర్మాణం చేసుకుంటే కేటీఆర్, హరీష్ రావులు జన్వాడలో ఫామ్ హౌస్ నిర్మాణం చేసుకున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ఏనాడు విద్యార్థుల సంక్షేమం కోసం కృషి చేయలేదని మంత్రి అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమానికి ఒక వసతిగృహం నిర్మించలేదని మంత్రి ఆరోపించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ధర్మారం మండలంలోని మిగులు భూములను పేద ప్రజలకు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు.ఇప్పటికే ధర్మారం మండలంలోని బొమ్మ రెడ్డి పల్లి లో 79 ఎకరాలు ప్రభుత్వ భూమిని కబ్జాదారుల కబంధ హస్తాల నుంచి విడిపించామని నర్సింగాపూర్ లో అనర్హుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను తీసుకొని పేద ప్రజలకు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు.2023 ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజాప్రతినిధిగా నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల కోసం పనిచేస్తున్నానని మంత్రి అన్నారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తనపై వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారని ప్రజల పక్షాన ఉన్న తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్న ఈశ్వర్ కు హితబోధ చేస్తున్నానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

# సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలి

**భూ సేకరణను వారం రోజుల్లో పూర్తి చేయాలి**

**రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని, భూ సేకరణ ప్రక్రియను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని పాల మూరు–రంగారెడ్డి వటేం 8వ ప్యాకేజ్ గెస్ట్ హౌస్‌లో నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో కొనసాగుతున్న పాల మూరు–రంగారెడ్డి ఎత్తిపోతల, మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, డిండి, ఉమామహేశ్వరం బాలెన్సింగ్ రిజర్వాయర్, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్, మార్కండేయ రిజర్వాయర్, కర్ణేతాండ్రా బాలెన్సింగ్ రిజర్వాయర్ తదితర సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, భూ సేకరణ పనుల పురో గతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనులు, భూ సేకరణ పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. కాలువల నిర్మాణం, రిజర్వాయర్ల అనుబంధ పనులు, పంప్‌హౌస్‌ల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్ల కల్పన వంటి అంశాలపై చర్చించారు. భూ సేకరణలో పెండింగ్‌లో ఉన్న కేసులు, రైతులకు చెల్లించాల్సిన పరిహారం అంశాలను కూడా మంత్రి సమీక్షించారు.ప్రాజెక్టుల పనులు ఆలస్యం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు సాగునీరు అందించడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి పనిని గడువులోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. భూ సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ పూర్తికాక పోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు అధికారులు తెలియజేయగా, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలు ప్రధానంగా వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతాలు కావడంతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే వేల ఎకరాలకు నీరు అందే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. దీని ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి కూడా గణనీయంగా పెరుగు తుందని అభిప్రాయపడ్డారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం సహించబోమని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల పరిశీలనకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి కావాల్సిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మెగా రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ అమరేందర్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ. లక్ష కోట్లు కావాలి

**మహబూబ్‌నగర్, ముద్ర:** పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేయాలంటే సుమారు రూ. లక్ష కోట్లు అవసరమవుతాయని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.80 వేల కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించి, రూ.28 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ప్రాజెక్టు పనులు పూర్తి కాలేదని ఆరోపించారు.ఈనెల 30, 31 తేదీల్లో సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను సందర్శించనున్న నేపథ్యంలో మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రాజేష్, సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి ప్రాజెక్టుల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం నార్లాపూర్ పీఆర్ఎల్ఐఎస్ పంప్ హౌస్ వద్ద మీడియాతో మాట్లాడారు.ప్రాజెక్టులో 90 శాతం పనులు పూర్తయ్యాయని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, అయితే రిజర్వాయర్ల మధ్య ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీ పనులు ఇంకా పూర్తికాలేదని మంత్రి పేర్కొన్నారు. నార్లాపూర్ వద్ద మొత్తం తొమ్మిది మోటార్లలో ఒక్కదానిని మాత్రమే గత ప్రభుత్వం ఏర్పాటు చేసి ఎన్నికల ముందు ప్రారంభించిందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మూడు మోటార్లు అమర్చామని, ఇంకా ఐదు కొత్త మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు.90 టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో ఎత్తిపోసేందుకు కాలువల నిర్మాణం, భూ సేకరణ, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. ప్రాజెక్టు పనులతో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని, వాటిని అధిగమించి నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో 4.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి జూపల్లి తెలిపారు.

# మహిళల అభ్యున్నతే సర్కార్ లక్ష్యం

**మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**

**మహిళా బాధితులకు భరోసా సఖీ కేంద్రాలు**

**రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క**





**ముద్ర, తెలంగాణ బ్యూరో :** మహిళల భద్రత, సాధికారత, ఆర్థిక అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ మిథిలా నగర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన సఖి కేంద్రం, వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌ను ఆమె ప్రారంభించారు. రూ.90 లక్షలతో నిర్మించిన సఖి భవనం, రూ.6 కోట్లతో ఏర్పాటు చేసిన వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌ను సందర్శించి వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం భవనాలు ప్రారంభించడం కాదని, తెలంగాణ మహిళల ఆశలు, భద్రత, సాధికారతకు కేంద్రాలుగా ఇవి పనిచేస్తాయని తెలిపారు. సమస్యల్లో ఉన్న మహిళలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకేచోట అన్ని సేవలు అందించేందుకు సఖి కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 36 సఖి కేంద్రాలు పనిచేస్తుండగా, ఇప్పటివరకు 12,385 మంది మహిళలకు వివిధ సేవలు అందించామని వెల్లడించారు. ఉద్యోగాలు, విద్య, ఉపాధి కోసం పట్టణాలకు వచ్చే మహిళలకు సురక్షిత వసతి అవసరమని, ఆ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 45 వర్కింగ్ ఉమెన్ హాస్టల్స్ వివిధ దశల్లో ఉన్నాయని, బంజారాహిల్స్‌లో ప్రారంభించిన హాస్టల్ మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తక్కువ ఖర్చుతో సురక్షిత వసతి, భోజనం, పిల్లల సంరక్షణ కోసం క్రెచ్ సెంటర్లు, ప్రత్యేక కేర్ గదులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. సఖి కేంద్రాలకు వచ్చే బాధిత మహిళలకు కౌన్సెలింగ్, ఐదు రోజుల వరకు ఆశ్రయం, భద్రత కల్పించే విధంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. మహిళా వారోత్సవాల భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, 8 వేలకుపైగా మహిళా భవనాలకు భూమిపూజలు నిర్వహించామని చెప్పారు. జూన్ 5న రాష్ట్రంలోని 554 మండలాల మహిళా సంఘాలకు బస్సులు అందజేస్తామని వెల్లడించారు. ప్రతి మండల సమాఖ్యకు ఒక్కో బస్సు ఇవ్వడంతో పాటు నెలకు రూ.70 వేల వరకు అద్దెను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల లక్షలాది మంది లబ్ధి పొందారని, దాదాపు రూ.10 వేల కోట్ల మేర ఆదా జరిగిందన్నారు. మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గతంలో రూ.5 లక్షల వరకు ఉన్న వడ్డీలేని రుణాలను ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. బ్యాంక్ లింకేజ్ ద్వారా ఒక్కో గ్రూప్‌కు రూ.20 లక్షల వరకు సాయం అందుతోందని తెలిపారు."అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా 60 లక్షల మహిళల్లో 12 లక్షల నిరక్షరాస్య మహిళలను గుర్తించి, తొలి దశలో 6 లక్షల మందిని అక్షరాస్యులుగా చేస్తామని తెలిపారు. అర్హులైన వారికి పదో తరగతి పరీక్షలు రాసే అవకాశమూ కల్పిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, అంబేద్కర్ ఆశయాలతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ సస్పెండ్

**పెట్రోల్, డీజిల్ కాదు, వడ్లు కొనాలని కామెంట్**

**సోషల్ మీడియాలో వైరల్**

**కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదుతో సస్పెండ్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ బైరి అశోక్ ను ఆర్టీసీ అధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. అయితే జగిత్యాలలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ నిర్వహించగా, అదే సమయంలో అటువైపుగా వచ్చిన ఆర్టీసీ డ్రైవర్ బస్సులోంచి పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని రైతులకు సంబంధించిన వరి, మొక్కజొన్న ధాన్యమును కొనుగోలు చేయాలని కామెంట్ చేశాడు. ఈ కామెంట్ ను బిజెపి, బిఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో వైరల్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం పై కామెంట్ చేసినందుకుగాను ఆర్టిసి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డ్రైవర్ అశోకును ఆర్టీసీ అధికారులు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై స్పందించిన డ్రైవర్ అశోక్ కాంగ్రెస్ నాయకులు పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై ధర్నా చేస్తున్న సమయంలో మా ఊరి వ్యక్తితో ముందు వడ్లు గురించి మాట్లాడండి అని చెప్పాను. అంతే దానికి నిన్ను డ్యూటీలో నుండి తీసేసాము, నువ్వు రాకు అని జీఎం చెప్పారని వాపోయాడు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 27.05.2026
www.mudranews.in | @mudranews



### టీ మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలు

రోజంతా సహజసిద్ధమైన శక్తి: టీ మానేసిన 15 రోజుల తర్వాత శరీరం కెఫిన్‌పై ఆధార పడకుండా, సొంతంగా శక్తిని ఉత్పత్తి చేసుకోవడం అలవాటు చేసుకుంటుంది. దీనివల్ల అలసట తగ్గి, రోజంతా ఎంతో ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉండవచ్చు.



# ధాన్యం కొనుగోలులో రాష్ట్రం విఫలం

**ప్రతీపైసా కేంద్రమే ఇస్తున్నా...ఎందుకీ వైఫల్యం**
**వడ్ల కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం మధ్యవర్తి మాత్రమే**
**మధ్యవర్తిత్వం చేసినందుకు రాష్ట్రానికి కేంద్రం కమిషన్ కూడా ఇస్తోంది**
**ఇకనైనా బేషజాలకు పోకుండా ప్రతి గింజను కొనుగోలు చేయండి**
**జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుని రైతుల ఇబ్బందులను తీర్చండి**
**రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన**

**ముద్ర, కరీంనగర్ :** ధాన్యం కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రమే ఇస్తున్నప్పటికీ, వడ్ల కొనుగోలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతగావడం లేదని మండిపడ్డారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకే ''రైతు గోస బీజేపీ భరోసా'' పేరుతో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఆధ్వర్యంలో యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈరోజు 1 కోటి 39 లక్షల రూపాయల అంచనా వ్యయంతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ భవనం రెండో అంతస్తు నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. వీటితోపాటు కార్మిక ఆరోగ్య సంక్షేమ భవన పునరుద్ధరణ, షెడ్ల మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. వడ్ల కొనుగోలు అంశంపై మీడియా అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి బండి సంజయ్ పై విధంగా స్పందించారు.

ధాన్యం కొనుగోలు పైసలన్నీ కేంద్రానివా? రాష్ట్రానివా? సమాధానం చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుతిలీతాడు మొదలు రవాణా ఖర్చులన్నీ కేంద్రమే ఇస్తోందన్నారు. ''వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కేవలం మధ్యవర్తి మాత్రమే. మధ్యవర్తిత్వం చేసినందుకు కేంద్రం రాష్ట్రానికి కమీషన్ కూడా ఇస్తోంది. అయినా ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి



విఫలమవుతోంది.''అని విమర్శించారు. ఇకనైనా బేషజాలకు పోకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని సూచించారు. ''ఇచ్చిన మాట ప్రకారం ప్రతి గింజను కొనుగోలు చేయండి. అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వండి. పొరపాట్లు జరిగిన చోట

## రంజుగా ప్లేఆఫ్స్

**- 20 ఓవర్లలోనే 254 భారీ స్కోరు చేసిన ఆర్సీబీ**
**- 33 బంతుల్లో 93 పరుగులతో రెచ్చిపోయిన పటీదార్**



**ముద్ర డెస్క్ :** ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్‌కు రంగం సిద్ధమైంది. ధర్మశాల వేదికగా మంగళవారం జరిగే క్వాలిఫయర్-1లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, మాజీ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్ జట్లు తల పడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకోనుండగా, ఓడిన జట్టుకు మరో అవకాశం ఉంటుంది. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న విరాట్ కోల్పోయిన ఆర్సీబీ లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు శుభ్‌మన్ గిల్ సారథ్యంలో గుజరాత్ టైటాన్స్ వరుస విజయాలతో టాప్-2లో చోటు దక్కించుకుంది. సాయి సుదర్శన్, జోస్ బట్లర్, రషీద్ ఖాన్ వంటి స్టార్ స్టార్‌తో జీటీ బలంగా ఏర్పడింది. ధర్మశాల పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో భారీ స్కోర్లు నమోదయ్యాయి. 0 ఓవర్లలోనే 254 భారీ స్కోరు చేసిన ఆర్సీబీ బ్యాటర్లు రెచ్చిపోయారు. 33 బంతుల్లో 93 పరుగులతో బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ రెచ్చిపోయారు. కోహ్లీ 43, క్రునాల్ పాండ్యా 43 పరుగులతో దంచికొట్టడంతో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 254 పరుగుల భారీ స్కోరు చేసింది.

## బాలల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు చేసుకోవాలి

**జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు.**

**ముద్ర, హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లాలో ప్రతిభావంతులైన 5-18 ఏళ్ల లోపు బాల బాలికలు 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' అవా ర్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, క్రీడలు, కళలు, సాంకేతిక పరిజ్ఞానం వంటి రంగాల్లో విశేష ప్రతిభ చాటిన బాల బాలికలు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల వారు జులై 31 లోపు https:///awards.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు . మరిన్ని వివరాలకు డీసీపీవో శ్రీనివాస్ చరవాణి 8499888255 ను సంప్రదించాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పసుపు పండుగకు వేళాయె

## హైదరాబాద్‌కు చేరిన ఎన్టీఆర్ భారీ కాంస్య విగ్రహం

**ముద్ర, అమరావతి :** కోనసీమ జిల్లా కొత్తపేటలోని వడయార్ శిల్పశాలలో ప్రముఖ శిల్పి రాజ్‌కుమార్ వడయార్ రూపొందించిన నందమూరి తారక రామారావు భారీ కాంస్య విగ్రహాన్ని సోమవారం హైదరాబాద్‌కు తరలించారు. అన్న గారి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 28న అమీర్‌పేట మైత్రీవనం కూడలిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేస్తున్న తొలి ఎన్టీఆర్ విగ్రహం ఇదే కావడం విశేషం.



# బంగ్లాదేశీయులపై బెంగాల్ యాక్షన్

**అక్రమ వలసదారులకు సీఎం సువేందు హెచ్చరిక**
**వెళ్లగొట్టకముందే పారిపోండి**
**బెంగాల్‌లో చొరబాటుదారులపై ఉక్కుపాదం**
**నిర్బంధ కేంద్రాలతో కఠిన చర్యలు**



**ముద్ర డెస్క్ :** ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారులపై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని సూచించారు. బంగ్లా ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే.. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతమున్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని.. వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు పేర్కొన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు.

**నిర్బంధ కేంద్రాల ఏర్పాటు..**

బెంగాల్ ప్రభుత్వం "గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి" అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొఇరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలుఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

**సరిహద్దు సమీపంలో బంగ్లాదేశీయులు**

అక్రమంగా రాష్ట్రంలోకి వలస వచ్చిన వారిపై బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు తమ స్వదేశానికి పయనమవుతున్నారు. మంగళవారం ఉదయం ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకీంపుర్ సరిహద్దు ప్రాంతంలో పదుల సంఖ్యలో బంగ్లాదేశీయులు గుమిగూడినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ చేపట్టిన సమయంలో కూడా ఈ సరిహద్దు నుంచి వందల సంఖ్యలో బంగ్లాదేశ్‌కు వెళ్లినట్లు తెలిపారు.

## స్త్రీ శక్తిని చాటేలా మహానాడు-2026

**2029 ఎన్నికలకు మహానాడులో రోడ్ మ్యాప్**
**కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న టీడీపీ అధినేత చంద్రబాబు**
**వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహానాడుకు నారా లోకేష్**
**రెండు రోజుల మహానాడుకు ఏర్పాట్లు పూర్తి**

**ముద్ర, అమరావతి** : మహానాడు... ఈ పేరు చెబితేనే తెలుగు ప్రజల్లో, తెలుగుదేశం పార్టీలో ఓ వైబ్రేషన్ పుడుతుంది. తెలుగుదేశం పార్టీ మహానాడును ఓ కార్యక్రమంలా కాకుండా... ఓ పండుగలా చేస్తుంది. అందుకే ఎన్టీఆర్ హయాం నుంచి మహానాడుకు.. మహానాడు కార్యక్రమాలకు అంతటి ప్రాధాన్యత.. ప్రాముఖ్యత ఏర్పడింది. 44 ఏళ్ల తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది... ఎత్తుపల్లాలు చూసింది. మహానాడులో గతాన్ని ఓసారి నెమరు వేసుకోవడం.. తాజా పరిస్థితులపై చర్చించుకోడం.. భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం అనేది టీడీపీలో అనాదిగా వస్తున్న ఆనవాయితీ. మహానాడు వేదికగా తీసుకున్న నిర్ణయాలు ఇటు పార్టీనే కాకుండా.. రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన సందర్భాలు ఉన్నాయి. మహానాడు ఈ స్థాయిలో ప్రభావం చూపుతుంది కాబట్టే... మహానాడులో ఏం చర్చిస్తారు... ఏం మాట్లాడతారు.. ఏయే అంశాలు ప్రస్తావనకు వస్తాయనేది ఇటు సామాన్య వర్గాల్లోనూ... అటు రాజకీయ, పరిపాలనా వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంటోంది. ఈ క్రమంలో 2026 మహానాడు బుధ, గురు వారాల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ఈ రెండు రోజుల మహానాడులో 20 తీర్మానాలు చేపట్టనున్నారు. వీటిల్లో 10 ఏపీ, 4 తెలంగాణ, 1 అండమాన్‌కు సంబంధించిన తీర్మానాలు ఉంటాయి. ఇక ఉమ్మడిగా 4 తీర్మానాలతో పాటు... చివరిగా అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానం ఉంటుంది.

**చర్చలు... తీర్మానాలు... కార్యాచరణ**

రెండు రోజుల మహానాడులో ఏయే అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టాలనే దానిపై పార్టీలో ఇప్పటికే కసరత్తు జరిగింది. ఈ ఏడాది చేపట్టనున్న మహానాడును స్త్రీ శక్తి థీమ్‌తో నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించుకున్న క్రమంలో మహానాడు వేదికగా జరగబోయే ప్రసంగాలు మహిళ శక్తి కేంద్రీకృతంగా ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. వివిధ అంశాలపై చర్చించడం... తీర్మానాలు చేయడం.. ఆయా అంశాలకు సంబంధించి కార్యాచరణ సిద్దం చేయడం అనే దిశగా రెండు రోజుల మహానాడు జరగనుంది. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 ఏళ్లు పూర్తి కావస్తున్నందున్న.. వచ్చే ఎన్నికలకు రోడ్ మ్యాప్ సిద్దం చేసుకునే దిశగా టీడీపీ అధినాయకత్వం మహానాడు వేదికగా దిశా నిర్దేశం చేసే సూచనలున్నాయి. దీంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. మహానాడు తొలి రోజున టీడీపీ జాతీయ అధ్యక్షులు సీఎం చంద్రబాబు ఉదయం 09.00 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్తారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన వారికి నివాళులర్పిస్తారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రారంభ ఉపన్యాసంతో కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత పార్టీ పద్దుల వివరాలను వివరిస్తారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు. స్త్రీశక్తి, కార్యకర్తే అధినేత, పేదల సేవలో వంటి అంశాలపై నేతల ప్రసంగిస్తారు. వీటిల్లో భాగంగా వివిధ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. సాయంత్రం 06.00 గంటలకు మొదటి రోజు కార్యక్రమం ముగుస్తుంది. ఇక రెండవ రోజు 28వ తేదీన ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పిస్తారు. తెలుగుజాతి విశ్వఖ్యాతి, గతంలో పార్టీ చేసిన పోరాటాలు, అన్నదాతకు అండగా, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించే సాయం, నా దేశం... నా బాధ్యత, ఆధ్యాత్మికాంధ్ర, మౌళిక సదుపాయల కల్పన, శాంతిభద్రతలు, విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం, సంపద సృష్టి వంటి అంశాలపై చర్చించి.. తీర్మానాలను ఆమోదిస్తారు. ఇక చివరిలో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముగింపు ఉపన్యాసంతో రెండు రోజుల మహానాడు ముగుస్తుంది.

**2026 మహానాడు ప్రత్యేకతలు**

మంత్రి నారా లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు తీసుకున్న తర్వాత జరుగుతోన్న తొలి మహానాడు ఇదే. ఈ నేపథ్యంలో నారా లోకేష్ ఏం ప్రసంగిస్తారు.. ఎలాంటి దిశా నిర్దేశం చేస్తారనే ఆసక్తి అందరిలోనూ కన్పిస్తోంది. ఇక గతానికి భిన్నంగా 2026 మహానాడును నిర్వహిస్తున్నారు. ఇటు ఫిజికల్‌గా.. అటు వర్చువల్ పద్దతిలో మహానాడు జరగనుంది. ముందుగా నెల్లూరులో మహానాడు చేపట్టాలని భావించినా... పశ్చిమాసియా దేశాల్లో యుద్ధం నేపథ్యంలో దేశంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడంతో నెల్లూరులో మహానాడు చేపట్టాలన్న నిర్ణయంలో మార్పు జరిగింది. మోదీ పిలుపునకు మద్దతుగా ఇంధన పొదుపు విధానాలను పాటిస్తూ మహానాడు నిర్వహించనున్నారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులతోపాటు.. జాతీయ, రాష్ట్ర కార్యావర్గాలకు చెందిన సభ్యులు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫిజికల్‌గా మహానాడులో పాల్గొంటారు. ఈ కమిటీల్లో లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా వారి వారి ప్రాంతాల నుంచి వర్చువల్ పద్దతిలో మహానాడులో పాల్గొంటారు. వర్చువల్ పద్దతిలో క్లస్టర్ల వారీగా మహానాడు నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 1,800కు పైగా క్లస్టర్లల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి అక్కడ కూడా పండుగ వాతావరణంలో మహానాడను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

## గోదావరి పుష్కరాలకు సమాయత్తమవుతున్న ప్రభుత్వం

**ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు**

**మహాదేవపూర్, ముద్ర:** రాబోయే గోదావరి పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సమాయత్తం అవుతోందని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. మంగళవారం సరస్వతి పుష్కరాల 6వ రోజు సందర్భంగా కాళేశ్వరం విచ్చేసిన భూపాలపల్లి, ములుగు, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి కలెక్టర్లతో కలిసి మెగా విశ్రాంతి భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సరస్వతి ఆది, అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పించిన సౌకర్యాలను పీపీటీ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం సుమారు రూ.1000 కోట్ల నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ఎదురైన లోటుపాట్లను గుర్తించి, గోదావరి పుష్కరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇందుకోసం గోదావరి పరివాహక ప్రాంతాల జిల్లాల కలెక్టర్లతో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పుష్కరాలకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పారిశుధ్యం, త్రాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్, విద్యుత్ సరఫరా, వీఐపీ, వివిఐపిలు పర్యటనలకు ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లాల వారీగా ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన సరస్వతి ఆది పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్ల నిర్మాణం, సరస్వతి విగ్రహం ఏర్పాటు, భక్తుల సౌకర్యార్థం టెంట్ సిటీ, వ్యాపార స్టాళ్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ములుగు, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల కలెక్టర్లు బొర్కడే హేమంత్ సహదేవరావు, కుమార్ దీపక్, కుమార్ దీపక్,



సత్య ప్రసాద్, నిజామాబాద్, నిర్మల్ జిల్లాల అదనపు కలెక్టర్లు బుజంగరావు, వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం ఆర్డీఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి**

**మహాదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా హంపికి చెందిన శ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సరస్వతి నదిలో పుణ్యస్నానం ఆచరించిన అనంతరం ఆలయానికి చేరుకున్న మహాస్వామికి అడిషనల్ కమిషనర్ ఎం. కృష్ణవేణి,ఆర్జేసీ రామకృష్ణారావు ల ఆధ్వర్యంలో అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. ఈవో మహేష్, ధర్మకర్తలు, ఆలయ అధికారులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.



## కర్కోటక సీఎం..

**పేదల ఇండ్లు కూలుస్తున్న ప్రభుత్వం: కవిత**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి కర్కోటక ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లు కూల్చి, ఆడబిడ్డలకు మనశ్శాంతి లేకుండా చేస్తోందని మండిపడ్డారు. వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేత బాధితులు, ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు, కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ బాధితులతో కలిసి గవర్నర్ శివప్రతాప్ శుక్లా ను లోక్ భవన్‌లో కలిసి సమస్యలను వివరించారు.అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత.. వెలుగుమట్లలో ఇండ్లు కూల్చివేతల వల్ల మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఓ మహిళకు గర్భస్రావం జరిగిన ఘటన బాధాకరమని అన్నారు. రైతుల పరిస్థితి కూడా దారుణంగా ఉందని, కల్లాల్లో ధాన్యం కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌ను పలుమార్లు మార్చడం, పరిగి ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూముల సేకరణపై గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్ష ఎకరాల భూమిని కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వం భూదోపిడీ ఆపకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

### టీ మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలు

తెల్లటి పళ్లు - నోటి ఆరోగ్యం: టీ తాగడం మానేయడం వల్ల పళ్లు పసుపు రంగులోకి మారకుండా తెల్లగా, ప్రకాశవంతంగా మెరుస్తాయి. అలాగే నోటి బ్యాక్టీరియా తగ్గి, నోటి దుర్వాసన సమస్య నుండి శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

## ప్రారంభ దశలోనే క్యాన్సర్ గుర్తిస్తే ప్రమాదాలు తగ్గింపు

### - డాక్టర్ దయాకర్ రావు



**ముద్ర, వనపర్తి:** అపెండిక్యులర్ మాస్, కోలన్ క్యాన్సర్ వంటి క్లిష్ట వ్యాధులను ప్రారంభ దశలో గుర్తించి సకాలంలో శస్త్రచికిత్స చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని మలక్‌పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి. దయాకర్ రావు తెలిపారు. వనపర్తిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అత్యాధునిక లాపరోస్కోపిక్, ఆంకాలజీ శస్త్రచికిత్సలతో మంచి ఫలితాలు సాధ్యమవుతున్నాయని చెప్పారు. వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల మహిళ తీవ్ర కడుపునొప్పి, జ్వరం, కడుపులో గడ్డ సమస్యలతో యశోద ఆసుపత్రిలో చేరగా, పరీక్షల్లో అపెండిక్యులర్ మాస్‌తో పాటు కోలన్ క్యాన్సర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. డాక్టర్ టి. సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభ పరీక్షలు నిర్వహించి, అనంతరం డాక్టర్ దయాకర్ రావు పర్యవేక్షణలో రైట్ హెమి కోలెక్టమీ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం ప్రత్యేక వైద్యం అందించడంతో రోగి ఆరోగ్యం మెరుగుపడిందని, ప్రస్తుతం డిశ్చార్జ్ చేసినట్లు పేర్కొన్నారు. కడుపునొప్పి, జ్వరం, జీర్ణ సమస్యలు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డీజీఎం లక్ష్మణా శ్రీకాంత్,ఏ.వాసు కిరణ్ రెడ్డి ఉన్నారు.

## జోనల్ కమిషనర్‌తో బండి రమేష్ భేటీ



**ముద్ర, కూకట్‌పల్లి:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ మరియు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. బుధవారం నియోజకవర్గంలో ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీధర్ బాబు పర్యటించనున్న నేపథ్యంలో, ఏర్పాట్లు మరియు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గాలి బాలాజీ, తూము వేణు, గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కొప్పుశెట్టి దినేష్, గంధము రాజు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### అక్రమనిర్మాణల కూల్చివేతలో

## సెంట్రింగ్ కార్మికులను ఇబ్బంది పెట్టొద్దు



**ముద్ర, మల్కాజిగిరి:** మాజీ కార్పొరేటర్ శ్రవణ్, సెంట్రింగ్ కార్మికుల సంఘం అధ్యక్షుడు మహేష్ యాదవ్ తదితరులు జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అక్రమ నిర్మాణాల కూల్చివేత సమయంలో సెంట్రింగ్ కార్మికులకు తమ సామగ్రిని తరలించేందుకు సమయం ఇవ్వాలని కోరారు. సమయం ఇవ్వకపోవడంతో లక్షల రూపాయల విలువైన సామాన్లు నష్టపోతున్నాయని తెలిపారు. అలాగే సఫిల్గూడ చెరువు మురికి నీటి డైవర్షన్ పనులు, ఓపెన్ జిమ్ పరికరాల మార్పు, దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వంటి పెండింగ్ అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని శ్రవణ్ విజ్ఞప్తి చేశారు. దీనిపై కమిషనర్ తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## పంట వ్యర్థాలు కాల్చితే కఠిన చర్యలు

### - రైతులకు వ్యవసాయ శాఖ హెచ్చరిక

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** పంట వ్యర్థాలు (స్టబుల్స్) కాల్చడం చట్టరీత్యా నేరమని తెలకపల్లి మండల వ్యవసాయ అధికారి పి. నర్మద రైతులకు హెచ్చరించారు. మొక్కజొన్న, వరి తదితర పంటల అవశేషాలను కాల్చవద్దని రైతులకు సూచిస్తూ, పంట వ్యర్థాల దహనం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. దట్టమైన పొగ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉండటంతో పాటు శ్వాసకోశ సంబంధిత వ్యాధులు పెరిగే అవకాశం ఉందన్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం దెబ్బతింటుందని, నేలలో ఉన్న సూక్ష్మజీవులు నశించి భూమి సారవంతత తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు రోటవేటర్ లేదా మల్చర్ సహాయంతో పంట వ్యర్థాలను భూమిలో కలపాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి పంట వ్యర్థాలు కాల్చితే ఎన్జీటీ సెక్షన్లు 19, 37, 39 ప్రకారం జరిమానా లేదా జైలు శిక్ష విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

## బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో, పరస్పర సౌభ్రాతృత్వంతో నిర్వహించుకోవాలని నాగర్ కర్నూల్ డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ ప్రజలకు సూచించారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఈద్గాలు, మసీదుల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఖుర్బానీ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, మున్సిపల్ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. సోషల్ మీడియాలో విద్వేషపూరిత పోస్టులు, తప్పుడు ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో సీఐ అశోక్ రెడ్డి, ఎస్ఐ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి పాలమూరు సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేస్తాం

### - నార్లాపూర్ రిజర్వాయర్ పనులను పరిశీలించిన మంత్రి జూపల్లి



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని వేగంగా పూర్తి చేస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ పంప్ హౌస్, ప్యాకేజీ–3 పనులను మంత్రి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడం, సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఇంధన ధరల పెంపుపై ఎడ్లబండ్ల ర్యాలీ

### - రాబందుల బీజేపీ సర్కార్ మనకొద్దు
### - ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ముద్ర, వనపర్తి:**

కేంద్ర ప్రభుత్వం పెంచుతున్న ఇంధన ధరలకు నిరసనగా వనపర్తిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎద్దుల బండ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదాని, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు మద్దతుగా పనిచేస్తూ నిరుపేదలపై భారాలు మోపుతున్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అవసరం లేదని ఆయన అన్నా రు. “డబుల్ ఇంజన్ సర్కార్ పేరుతో మోదీ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది” అంటూ విమర్శించారు. పెట్రో ల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేసిన ఆయన, ధరల పెంపుతో రైతులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే గ్రామ స్థాయి నుంచి ఢిల్లీ వరకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, వనపర్తి నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పెద్దయించిన పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి


### - అవగాహన కార్యక్రమాల్లో కలెక్టర్లు, అధికారులు పిలుపు

**నారాయణపేట/నాగర్‌కర్నూల్, ముద్ర:**

బాల్య వివాహాల నిర్మూలనకు సమాజం మొత్తం కలిసికట్టుగా పనిచేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక పిలుపునిచ్చారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దామరగిద్ద మండలం కంసాన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన “బాల్య వివాహ రహిత తెలంగాణ” అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వల్ల బాలికలు ఆరోగ్య, సామాజిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి బాలిక విద్యపై దృష్టి పెట్టి జీవితంలో లక్ష్యాలను సాధించాలని సూచించారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో కూడా మహిళా వారోత్సవాల భాగంగా “బాల్య వివాహం – బతుకు ఆగం” నినాదంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో పోస్టర్ విడుదల చేసి ప్రజల్లో చైతన్యం కల్పించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ సునీంద్ర, కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు కలిసి బాల్య వివాహాలను అరికట్టాలని అధికారులు పిలుపునిచ్చారు.



నారాయణపేటలో..



నాగర్ కర్నూల్ లో..



### తాగునీటి సమస్యను పరిష్కరించండి

**ముద్ర తాండూరు ప్రతినిధి:** వికారాబాదు జిల్లాలోని తాండూరు మున్సిపల్‌లో తాగేనీటి సమస్యను పరిష్కరించాలి అంటూ జిల్లా కలెక్టర్‌ను బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు కోరారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ దీపక్ తివారిని బీఆర్ఎస్ పార్టీ, సీనియర్ నాయకుడు సంతోష్ గౌడ్, ఎజాజ్, కౌన్సిలర్లు ఈర్షాద్, అనిల్, యోగానంద్, తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందుకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు కౌన్సిలర్లు తెలిపారు.

### ప్రభుత్వ పాఠశాలలే విద్యార్థుల భవిష్యత్తుకు పునాది

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** బడిబాట కార్యక్రమంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా నందివడ్డేమాన్ గ్రామంలో మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సంత సందర్భంగా రచ్చకట్ట వేదికగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవల గురించి గ్రామస్తులకు వివరించారు. ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొంది విద్యను అభ్యసించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి. మురళీమోహన్, ఉ,పసర్పంచ్ నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బక్రీద్ పండుగ సందర్భంగా సమన్వయ సమావేశం

**ముద్ర, శేరిలింగంపల్లి:**

రాబోయే బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు సైబరాబాద్ సీపీ డా. ఎం. రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎంసీ, రెవెన్యూ, వెటర్నరీ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జూమ్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో సీనియర్ పోలీస్ అధికా రులు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా పరిశుభ్రత, ప్రజారోగ్యం, జంతు వ్యర్థాల నిర్వహణపై అధికారులు చర్చించారు. ఈద్‌గాహ్‌లు, మసీదులు, నివాస ప్రాంతాల వద్ద జంతు వ్యర్థాల సేకరణకు నల్ల పాలిథిన్ కవర్లు అందుబాటులో ఉంచడం, వ్యర్థాల తరలింపుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సీపీ డా. ఎం. రమేష్ మాట్లాడుతూ పండుగను సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ జంతు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా అధికారుల సూచనలు పాటించాలని కోరారు. రోడ్ల శుభ్రత కోసం పారిశుధ్య సిబ్బంది, వాటర్ ట్యాంకర్లు అందుబ టులో ఉంచాలని, అవసరమైన చోట్ల బ్లీచింగ్ పౌడర్ వినియోగించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. ఈ సమా వేశంలో డీసీపీలు సుధీంద్ర, ముత్యం రెడ్డి, సాయి మనో హర్, సంజీవ్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## జిల్లాకు ప్రభుత్వ సంస్థలను తిరిగి తీసుకురావాలి

### - తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ధర్నా, వినతిపత్రం

**ముద్ర, నారాయణ పేట:**

నారాయణపేట జిల్లా నుంచి తరలిపోయిన ప్రభుత్వ సంస్థలను తిరిగి తీసుకువచ్చి వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గవినోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టిఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలని, రైతు భరోసా నిధులను విడుదల చేయాలని కోరారు. కొత్త ఎస్పీ కార్యాలయం నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించాలని, పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీరాజ్ ఎస్సీ కార్యాల యాన్ని వికారాబాద్ నుంచి నారాయణపేటకు మార్చాలని, దేవాదాయ శాఖ కార్యాలయాన్ని కూడా జిల్లాకు తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తెలంగాణ రక్షణ సేన జెండాను ఆవిష్కరించి నినాదాలు చేశారు. తరువాత కలెక్టరేట్‌కు వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు శ్రీనివాస్ రావు, కృష్ణ కిషోర్, నీలి జనార్దన్, పట్టణ అధ్యక్షుడు చంద్రు, నర్సింహా రెడ్డి, మనోజ్ గౌడ్, శివకుమార్ ఆశన్నపల్లి నారాయణ రెడ్డి, రమేష్, ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్, నరేష్, నర్సింహా, బసప్ప, మాణిక్యప్ప, వెంకటప్ప, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలి

### - ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**ముద్ర, కూకట్‌పల్లి:**

ఖైతలాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. అమృతనగర్ తండాకు చెందిన 62 మంది లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల పంపిణీ జరగనున్న నేపథ్యంలో అక్కడి మౌలిక వసతులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో బాలానగర్ చిత్తారమ్మ బస్తీ, ఖైతలాపూర్ ప్రాంతాల్లో తొలి విడత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు గుర్తుచేశారు. గతంలో 67 మందికి ఇళ్లు కేటాయించగా, మిగిలిన 62 మంది నిరుపేదలకు ఇప్పుడు ఇళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలకు 10 శాతం ఇళ్లను కేటాయించాలని, అర్హులైన విలేకరులకు కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబులకు విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్‌లో ఖాళీ అయిన ప్రభుత్వ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతూ, అవసరమైతే సీఎస్ఆర్ నిధులతో తానే నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు బిక్షపతి, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్ గౌడ్, ఎంఆర్ఓ స్వామితో పాటు ఇంజనీరింగ్, హౌసింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ముద్ర

సమగ్ర సమాచార పత్రిక

బుధవారం 27.05.2026

www.mudranews.in | @mudranews




### టీ మానేయడం వల్ల ప్రయోజనాలు

ప్రశాంతమైన నిద్ర : టీలోని కెఫిన్ మెదడును ఉత్తేజపరచకుండా ఉండటం వల్ల మనస్సుకు పూర్తి ప్రశాంతత లభిస్తుంది. దీనివల్ల రాత్రి పడుకోగానే ఎటువంటి ఇబ్బంది లేకుండా హాయిగా నిద్రపడుతుంది.



# జగిత్యాలను ఎడ్యుకేషన్ హబ్ గా మారుస్తాం

**- కేంద్రీయ విద్యాలయానికి నర్సింగాపూర్ లో స్థలం కేటాయింపు**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** జగిత్యాలను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడమే తమ లక్ష్యమని సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తో పాటు కలిసి నర్సింగాపూర్ లోని కేంద్రీయ విద్యాలయానికి కేటాయించ తలపెట్టిన స్థలాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ నర్సింగాపూర్ శివారులోని సర్వే నంబర్ 437లో స్థలం కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేసి ముందుకు సాగుతున్నారని తెలిపారు. జగిత్యాలకు మంజూరైన కేంద్రీయ విద్యాలయాన్ని నర్సింగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ఆరెకరాల స్థలాన్ని సర్వే నంబర్ 437లో కేటాయిస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే రూ. 33 కోట్లతో ఐటీఐ, ఏటీసీ సెంటర్ ను ఇక్కడ ఏర్పాటు చేశామన్నారు. వృద్ధ ఆశ్రమం సైతం ఇక్కడే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో ఈ ప్రాంతం ఎడ్యుకేషన్ హబ్ గా మారుతుందని మంత్రి తెలిపారు. చల్ గల్ లోని వ్యవసాయ పరిశోధనకు సంబంధించిన వాలంతరీ భూములను పన్నెండెకరాలు కేంద్రీయ విద్యా లయానికి, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కేంద్రీయ విద్యాలయానికి రెండు ఎకరాల స్థలం సరిపోదని వివాదం నేపథ్యంలో నర్సింగాపూర్ లో ప్రభుత్వ భూమి టాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం చల్ గల్ మరిన్ని వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన నేపథ్యంలో వ్యవసాయ పరిశోధనల భవిష్యత్తు అవసరాల కోసం అక్కడి భూములను అంతకు మించి కేటాయించే అవకాశం లేదన్నారు. నర్సింగాపూర్ భూముల ప్రతిపాదనలు కేంద్రీయ విద్యాలయ అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు ఎంపీ అరవింద్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సహకరించాలని కోరారు. ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ ను విధుల్లోకి తీసుకోవాలి

**- ఆర్ ఎంకు గంగుల వినతిపత్రం అందజేత**



**ముద్ర, కరీంనగర్:** తొలగించిన ఆర్టీసీ డ్రైవర్ ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జీవన్ రెడ్డిల ఆధ్వర్యంలో బీఆర్ ఎస్ నాయకులు మంగళవారం ఆర్ఎంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్ పై వేటు వేయడాన్ని ఖండించారు ప్రజా పాలన... ప్రభుత్వమంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నియంతృత్వ పాలన కొనసాగిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ దుర్మార్గమన్నారు. సస్పెండ్ చేసిన ఆర్టీసీ డ్రైవర్ అశోక్ కు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. డ్రైవర్ సస్పెన్షన్ ఎత్తివేసే వరకు అవసరమైతే అర్ఎం కార్యాలయం ఎదుట బైఠాయిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన డ్రైవర్ అశోక్ సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. బీఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తాత్కాలిక డ్రైవర్ గా ఉన్న అశోక్ ను పర్మినెంట్ డ్రైవర్ గా ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## పంట పొలాలను కాల్చొద్దు

**- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



**మహాదేవపూర్, ముద్ర:** పంట అవశేషాలను, పొలాలను కాల్చవద్దని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. మంగళవారం మహాదేవపూర్ మండల పరిధిలోని కాళేశ్వరంలో పంట పొలాలను కాల్చడంతో అగ్ని ప్రమాదం జరిగిందన్నారు. భూపాలపల్లి అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు, కాళే శ్వరం ఎస్సె తమాషా రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినట్లు చెప్పారు. పొలాలను కాల్చడం వల్ల పర్యావరణానికి నష్టం కలగడమే కాకుండా సమీపంలోని పంటలు, విద్యుత్ స్తంభాలు, చెట్లు, ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు.రైతులు అప్రమత్తంగా ఉండి పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను వినియోగించాలని సూచించారు. ఎవరైనా అగ్ని ప్రమాదాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

# కరీంనగర్ అభివృద్ధికి నిధుల వరద

**- కేంద్ర మంత్రి బండి సంజయ్**



**ముద్ర, కరీంనగర్:** నగర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు తెస్తున్నట్లు కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవన రెండో అంతస్తు నిర్మాణ పనుల ప్రారంభ కార్యక్రమం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు కీలక అంశాలను వెల్లడించారు. కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయించిందని ఆయన తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి బాధ్యతను స్వయంగా తీసుకున్నానని ఆయన పేర్కొన్నారు. ఆ హామీ ప్రకారం 100 రోజుల్లోనే రూ.840 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరించడంతో పాటు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ సహా అధికారులు వేగంగా ప్రతిపాదనలు రూపొందించి ఢిల్లీకి పంపినట్లు తెలిపారు. 48 గంటల్లోనే ఢిల్లీలో సమావేశం నిర్వహించి కేంద్ర బృందాన్ని కరీంనగర్‌కు పంపించారని ఆయన గుర్తుచేశారు. యూసీఎఫ్ జాబితాలో కరీంనగర్ ఉండదని కొందరు అధికారులు చెప్పినా, పట్టుదలతో కేంద్ర పెద్దలను ఒప్పించి జాబితాలో చేర్పించానని బండి సంజయ్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కేవలం 17 ప్రాజెక్టులకు మాత్రమే ఆమోదం లభించగా అందులో కరీంనగర్ కూడా ఉండటం గర్వకారణమన్నారు. యూసీఎఫ్ నిధులతో కరీంనగర్ రూపురేఖలు మారబోతున్నాయని స్పష్టం చేశారు. డంపింగ్ యార్డు అభివృద్ధికి రూ.80 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. గతంలో స్మార్ట్ సిటీ కింద రూ.900 కోట్లు, అమృత్-1, అమృత్-2 పథకాల ద్వారా రూ.277 కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. శివారు ప్రాంతాల అభివృద్ధి, పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. తన ఏడేళ్ల ఎంపీ పదవీ కాలంలో రూ.20 వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. శాతవాహన కాలేజీకి 12బి హోదా, లా కాలేజీ మంజూరు, ఎస్సారార్ కాలేజీకి అటానమస్ హోదా, అంబేద్కర్ స్టేడియం, జమ్మికుంట స్టేడియం అభివృద్ధికి నిధులు వంటి అనేక ప్రాజెక్టులను గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులు వినియోగించినట్లు తెలిపారు. త్వరలో టెన్త్ విద్యార్థులకు ఉచిత సైకిళ్లు అందించనున్నట్లు కూడా ప్రకటించారు. కరీంనగర్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే మోడల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కేంద్ర పారామిలటరీ గ్రూప్ సెంటర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 14 ఎకరాలు కేటాయించిందని, దీనికి ధన్యవాదాలు తెలిపారు. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బెటాలియన్ల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్నికల తరువాత రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్లమెంట్ నియోజకవర్గానికి వేల కోట్ల రూపాయల నిధులు తీసుకువస్తానని స్పష్టం చేశారు.

## రైతుల గురించి మాట్లాడటం నేరమా..?

**- ఏఐఎఫ్ బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్**



**ముద్ర, కరీంనగర్:** ప్రజాస్వామ్యంలో ఉద్యోగి తన అభిప్రాయం వ్యక్తం చేయడం తప్పా..? రైతుల సమ స్యల గురించి మాట్లాడటం నేరమా..? అని ఏఐ ఎఫ్ బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆర్టీసీ డ్రైవర్ అశోక్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తీసుకున్న సస్పెన్షన్ నిర్ణయం ప్రస్తుతం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా మీడియాలో కూడా పెద్ద చర్చకు దారి తీసిందన్నారు. రైతుల సమస్యలపై మాట్లాడినందుకు ఉద్యోగిని సస్పెండ్ చేయడం ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. "నేను రాజకీయాల గురించి మాట్లాడలేదు అని అశోక్ చెబుతున్నప్పటికీ, ప్రభుత్వం అతనిపై కఠిన చర్యలు తీసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. ఉద్యోగులకూ తమ అభిప్రాయాన్ని చెప్పే స్వేచ్ఛ ఉండాలన్నారు. తక్షణమే ఆర్టీసీ డ్రైవర్ అశోక్‌పై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి, ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పుష్కర స్నానం చేసిన దేవాదాయ శాఖ కమిషనర్



**మహాదేవపూర్, ముద్ర:** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా మంగళవారం పవిత్ర త్రివేణి సంగమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు కమిషనర్ కు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామివారికి అభిషేకం చేశారు. శుభానందదేవి ఆలయంలో అర్చనల అనంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఏడీసీ ఎం. కృష్ణవేణి, ఆర్ జేసీ రామకృష్ణారావు, డిప్యూటీ కమిషనర్ సునీత, ఆలయ ఈవో మహేష్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు..



**ముద్ర, కోరుట్ల:** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. కోరుట్ల పట్టణ స్వశక్తి మహిళా సంఘ భవనంలో మున్సిపల్ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత, శ్రీనివాసరావు ల సమక్షంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జువ్వాడి నర్సింగరావు హాజరయ్యారు. మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ వైస్ చైర్మన్ షాహిద్ లతో కలిసి మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టారు. అనంతరం జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**- తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా పర్యవేక్షించాలి**

**- కలెక్టర్ రాహుల్ శర్మ**




**మహాదేవపూర్, ముద్ర:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా జరగాలని జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసీ కార్యాలయంలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ఏపీఎం లు, పీఏసీఎస్ల సీఈవోలతో ధాన్యం కొనుగోళ్ల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా జరిగేందుకు తహసీల్దార్లు ప్రత్యేక అధికారులుగా వ్యవహరించి పర్యవేక్షించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మన జిల్లాలో పంటల కోతలు ఆలస్యమైతాయని, అందువల్ల ఈ నెల చివరి వరకు ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. కొరత ఉన్న చోట ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. స్వచ్ఛందంగా ట్రాక్టర్ల ద్వారా రైతులు ధాన్యం మిల్లులకు తరలి ఛార్జీలు చెల్లిస్తామని తెలిపారు. గోదాముల కొరత లేకుండా ఉండేందుకు పత్తి మిల్లులను సైతం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్లు ప్రతి మిల్లు దగ్గర రెవెన్యూ సిబ్బందిని నియమించి పటిష్ఠ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యాన్ని కాంటా వేసి గన్ని సంచులలో నింపి టార్పాలిన్లను కప్పి ఉంచాలని సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి కొనుగోళ్లు నిర్ణీత సమయానికి పూర్తయ్యేలా చూడాలన్నారు. గన్ని సంచుల కొరత, టార్పాలిన్ ల కొరత ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, డీఎం రాములు, డిఆర్డీఓ బాల కృష్ణ, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లు గీతా కార్మికులను ఆదుకుంటాం



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:** ఈత చెట్లు కాలిపోయి నష్టపోయిన కల్లు గీతా కార్మికులను ప్రభుత్వం తరుపున ఆదు కుంటామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు కాలిపోయిన ఈత, తాటి వనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, ఏఎంసీ మాజీ చైర్మెన్ కొలుగురి దామోదర్ రావు, పీసీసీ సెక్రటరీ బండ శంకర్,సర్పంచ్ వంశీ, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, జ్యోతి లక్ష్మణ్, కౌన్సిలర్ చాంద్ పాషా,అడువాల జ్యోతి లక్ష్మణ్, తహసీల్దార్ హకీమ్, అర్ ఐ భూమయ్యా, తిరుపతి గౌడ్, మల్లేశం గౌడ్, జయరాం సురేష్, కుడుకల లక్ష్మణ్, గిరి, శరత్ రావు, గౌడ సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## టీ మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలు




బరువు తగడం : టీని మానేయడం ద్వారా అందులో వాడే పాలు, చక్కెర వల్ల శరీరానికి చేరే అనవసర కేలరీలకు అడ్డుకట్ట పడుతుంది. ఇది పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వును కరిగించి, సహజంగా బరువు తగ్గడానికి ఎంతగానో తోడ్పడుతుంది.

## బెల్లి లలితక్క విగ్రహ నిర్మాణ పనులకు శంకుస్థాపన




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకురాలు బెల్లి లలితక్క విగ్రహ నిర్మాణ పనులకు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేశారు. మంగళవారంభువనగిరి పట్టణంలోని అమరవీరుల స్థూపం సమీపంలో నిర్వహించిన విగ్రహ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి ముందు అమరవీరుల స్థూపం వద్ద అమరులకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో బెల్లి లలితక్క తన గానంతో ప్రజల్లో చైతన్యం నింపి ప్రత్యేక గుర్తింపు పొందారని తెలిపారు. ఆమె పాటలు ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో పెంపొందించాయని, తెలంగాణ సాధనలో ఆమె చేసిన సేవలు, త్యాగాలు చిర స్మరణీయమని పేర్కొన్నారు. భావితరాలకు ఆమె సేవలను గుర్తుచేసే విధంగా ఈ విగ్రహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ ఛైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి – రవికుమార్, వైస్ ఛైర్పర్సన్ పోతంశెట్టి మంజుల – వెంకటేశ్వర్లు, భువనగిరి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, పట్టణ, మండల ప్రజాప్రతినిధులు, బెల్లి లలితక్క కుటుంబ సభ్యులు, విగ్రహ స్థాపక కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కుల, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరణ చేపట్టాలి



**ముద్ర, సూర్యాపేట:** జిల్లా ప్రతినిధిజిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం బిబి గూడెం లోని శివ దుర్గ రైస్ మిల్, తిరుమలగిరి మండలాల్లోని ఇటూరు గ్రామంలో సోమేశ్వర రైస్ మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారా రైస్ మిల్, తాటిపాముల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్ లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయ కూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఎస్ఓ మోహన్ బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహసిల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహసిల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్లు యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలు వచ్చే అవకాశం.. ధాన్యాన్ని కాపాడుకోవాలి



**ముద్ర, తుంగతుర్తి :** వర్షాలు వచ్చే వాతావరణ సూచనలు కనిపిస్తున్నందున రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవాలని అదనపు కలెక్టర్ హరి సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతూ ధాన్యం ఎగుమతులు త్వరలో అయ్యేలా చూడాలని ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమై సమయంలో వర్షాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ధాన్యం త్వరగా ఎగుమతి అయ్యేలా చూడాలని అన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కప్పి పెట్టుకోవాలని వర్షం బారిన పడకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం లారీల కొరత లేకుండా చూస్తామని అన్నారు. ఆయనతోపాటు తహసిల్దార్ దయానందం రైతులు ఉన్నారు.

## ప్రజలకు భారంగా మారిన బీజేపీ సర్కార్

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :** బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతో ప్రజల జీవనం భారంగా మారిందని సిపిఐ జిల్లా ఖమ్మం కార్యదర్శి దండి సురేష్ ఆరోపించారు. మోడీ అనుసరిస్తున్న విధానాలు పేద, మధ్యతరగతి ప్రజలకు శాపంగా మారాయని ఆయన తెలిపారు. ధరల పెరుగుదలకు సంబంధించి ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని , ఇదే సమయంలో పెట్రో ధరలను విపరీతంగా పెంచుతుందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు, బిజెపి అధికారంలోకి వచ్చిన నాటికి నేటికి పెట్రోల్ ధరల్లో ఎంత పెరుగుదల కనిపించిందో ప్రజలు గమనించి ఈ ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. కేవలం 15 రోజుల వ్యవధిలోనే నాలుగు దపాలుగా పెట్రో ధరలను పెంచారని దీనితో ప్రజలపై అదనపు భారం పడుతుందని పెట్రోల్ వినియోగదారులకే కాకుండా డీజిల్, పెట్రోల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయన్నారు. పదేళ్ల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు రెండు, మూడు రేట్లు పెరిగాయని సురేష్ తెలిపారు. మోడీ పాలన కేవలం సంపన్నుల కోసమే సాగుతుందని ఇప్పుడు కూడా ఆయిల్ కంపెనీల లాభాల కోసమే ప్రజలపై భారాలు మోపారన్నారు. పెంచిన ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ధరల పెరుగుదలపై పోరాట కార్యాచరణ రూపొందించుకుని ఉద్యమిస్తామని ఆయన తెలిపారు.

# కొండపైన దుకాణాల టెండర్లు వేయాలి

- దేవస్థానంలో సెక్షన్ అధికారులతో వర్తక సంఘం కుమ్మక్కయ్యారు.
- వర్తక సంఘం అందరికీ ఐదు నుండి 100 ఎకరాల భూసాములు
- వర్తక సంఘం పేరిట 30 నుండి 40 లక్షలకు అమ్ముకుంటున్నారు.
- కొండపైన వర్తక వ్యాపారాల దోపిడీని అరికట్టి దుష్ట శిక్షణ శిష్ట రక్షణ చేయాలి



**ముద్ర, యాదగిరిగుట్ట :** శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం కొండపై వర్తక వ్యాపారుల దోపిడీని అరికట్టి, అక్కడి దుకాణాలను పారదర్శకంగా టెండర్ల ద్వారా కేటాయించాలని అన్నల్దాస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్, ఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కళాకారులతో కలిసి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వేషధారణలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలు ఆలయానికి భారీ ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని వెంకటేష్ ఆరోపించారు. ప్రస్తుతం కొండపై ఉన్న 10 తాత్కాలిక దుకాణాలను టెండర్ల ద్వారా కేటాయిస్తే దేవస్థానానికి సుమారు రూ.30 కోట్ల ఆదాయం సమకూరుతుందని తెలిపారు. సెల్ఫోన్ లగేజీ కౌంటర్ ద్వారా 12 నెలలకు రూ.2.62 కోట్లు, దీపారాధన ద్వారా 11 నెలలకు రూ.1.10 కోట్లు ఆదాయం వస్తోందని పేర్కొన్నారు.టెండర్ గడువు ముగిసినా శాఖ అధికారులతో కుమ్మక్కై వర్తక సంఘం వ్యాపారులు రెన్యువల్ పేరుతో దుకాణాలను కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం దేవస్థానానికి సంవత్సరానికి రూ.1.69 కోట్లు మాత్రమే చెల్లిస్తూ 10 తాత్కాలిక దుకాణాలను కొనసాగిస్తున్నారని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.గతంలో 112 తాత్కాలిక దుకాణాలను వివిధ పేర్లతో టెండర్ల ద్వారా కైవసం చేసుకున్నారని, ఇప్పుడు వర్తక సంఘం పేరిట వాటిని పెంచుతూ భక్తులను దోచుకుంటున్నారని అన్నారు. కొంతమంది వ్యాపారులు దుకాణాలను రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు ఇతరులకు అమ్ముకుంటూ కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని ఆరోపించారు. లీజ్, సబ్లీజ్ల రూపంలో దుకాణాల బదిలీలు జరుగుతున్నాయని తెలిపారు.గత ప్రభుత్వం కొండపై వ్యాపారాలకు అవకాశం లేకుండా కొండ కింద వ్యాపార సముదాయాలను నిర్మించినప్పటికీ, వాటిని వినియోగించకుండా దేవస్థానానికి కోట్ల రూపాయల ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శించారు. స్థానిక నిరుద్యోగులకు అవకాశాలు లేకుండా కొంతమంది వ్యాపారులు దేవస్థాన అధికారులతో కుమ్మక్కై వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.కొండపై ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న వర్తకులను తొలగించి, దుకాణాలను పారదర్శక టెండర్ల ద్వారా కేటాయించాలని స్థానిక నిరుద్యోగులు, వ్యాపారులు కోరుతున్నారని వెంకటేష్ తెలిపారు. దేవస్థాన ఆదాయాన్ని దోచుకుంటున్న వారిపై చర్యలు తీసుకుని భక్తులను కాపాడాలని డిమాండ్ చేశారు.

## అడిషనల్ కలెక్టర్ కు వినతి పత్రం



**ముద్ర, యాదగిరిగుట్ట :** యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలోయాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాని రద్దు చేసి టెండర్లు వేయాలని కోరుతూ మంగళవారం యాదాద్రి భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డికి కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరంఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కమిటీ సభ్యులు మాట్లాడుతూ కొండపైన వర్తక సంఘాన్ని రద్దుచేసి టెండర్ నిర్వహించాలని టెండర్ ద్వారా దేవస్థానానికి 20 నుండి 30 కోట్ల ఆదాయము సమకూరుతుందని తద్వారా భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించ వచ్చని నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. వర్తక సంఘంన్ని తక్షణమే రద్దు చేసి టెండర్ లకు పిలవాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు, పల్లపు బాలయ్య, దేవపూజ అశోక్, బుగ్గా ఆంజనేయులు, మాటూరి బాలయ్య, బండి వాసు కొన్నె సంజీవ, బండి అనిల్, గ్యాదపాక క్రాంతి, గౌడ శ్రీశైలం, ముక్కెర్ల చిన్న రాజు, అంకంరాజు, పులగం విజయ్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుపై బీజేపీ అపోహలు సృష్టిస్తోంది

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** వడ్ల కొనుగోలు అంశంపై బీజేపీ రైతుల్లో అపోహలు సృష్టిస్తూ గందరగోళ పరిస్థితులు కల్పించే ప్రయత్నం చేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విమర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ భరోసా యాత్ర నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. గత రెండు పంటల సీజన్ల నుంచి కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్ల మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఆర్డర్లు ఇవ్వకపోవడం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు.మా ప్రజాప్రతినిధులు, అధికారులు, మిల్లర్లు, రైతులతో సమన్వయం చేస్తూ వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారన్నారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రతిపక్షాల మాటలు నమ్మి అయోమయానికి గురికావద్దని సూచించారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అధిక ధరకు వడ్ల కొనుగోలు జరుగుతోందని తెలిపారు.గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం మరింత మెరుగ్గా వడ్ల కొనుగోలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు.గతంలో "వరి వేస్తే ఉరి" అన్న పరిస్థితులను గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతును రాజుగా చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. రైతు భరోసా యాత్రను తెలంగాణలో కాకుండా ఢిల్లీలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర బీజేపీ నాయకులకి సవాల్ చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్, గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్ పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలోని నల్లగొండ చౌరస్తా నుండి హైదరాబాద్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులను మంగళవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. వార్డు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద ఫీట్ల రోడ్డు ఉన్నప్పటికీ ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేస్తున్నామని, పూర్తిస్థాయిలో నష్టపోయిన వారికి తగు విధంగా న్యాయం చేస్తామన్నారు. భువనగిరి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని, ప్రజలంతా సహకరించాలన్నారు. మునిసిపల్ చైర్పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మాజీ మునిసిపల్ చైర్మన్లు వెంకటేశ్వర్లు, జహంగీర్, మునిసిపల్ కమిషనర్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు కూర వెంకటేష్, కౌన్సిలర్ తాహెరా బబ్లు, బొంతల నర్సింగ్రావ్, బెండ స్వరూపలాల్ రాజ్, కృష్ణవేణి రఘుబాబు, సుజాయత్ అలీ కౌసర్, జగన్, లయిక్ అహ్మద్, పోలిశెట్టి అనిల్, బురాన్, చల్ల కిషోర్, మనీష్, శివతేజ, మని, వరుణ్, దినేష్ పాల్గొన్నారు.

## స్వర్ణ గిరిలో నిత్య కైంకర్యాలు



**స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో మంగళవారం నిత్యకాంకర్యాలు వైభవంగా జరిగాయి. లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు. అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేద మంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.**

– ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## బాల్య వివాహాల అవగాహన ప్రచార రథం ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బాల్య వివాహాల పట్ల అవగాహన, బాలికల భవిష్యత్తు కోసం సమాజం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పిలుపు నిచ్చారు. శిశు వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రెండవ రోజు మంగళవారం జిల్లా ఐ డి ఓ సి కార్యాలయ ప్రాంగణంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార రథాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)వెంకా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో బాలికల హక్కులను పరిరక్షించడం, బాల్య వివాహాలను అరికట్టడం, బాలికలకు విద్యను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార రథం ద్వారా గ్రామాలలో, సంస్కృతిక కళా బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాల గురించి ప్రజలకు వివరించనున్నారు. ముఖ్యంగా బాలికలు విద్యను కొనసాగించి స్వయం సాధికారత సాధించేలా తల్లిదండ్రులను చైతన్యపరచనున్నారు.18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం చట్ట విరుద్ధమని, బాల్య వివాహాల నిరోధక చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని, అనుమానాస్పద ఘటనలు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 కి సమాచారం ఇవ్వాలని సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ప్రచార రథంలో బాల్య వివాహాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు, సందేశాలు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జిల్లా సంక్షేమ సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, జిల్లా వైద్యాధికారి మనోహర్ జిల్లా పౌర సంబంధాల అధికారి అరుంధతి, సివిల్ సప్లై అధికారి రోజా రాణి. సీడీపీఓ శైలజ. జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది. సాంస్కృతిక కళా సారధి బృందం సభ్యులు. తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

ప్రారంభించిన కలెక్టర్ స్నేహశబరీష్




**ముద్రప్రతినిధి, మహబూబాబాద్:** నిబంధనల మేరకు అర్హులైన జర్నలిస్ట్ లందరికీ అక్రిడిటేషన్ కార్డ్ లను అందజేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరీష్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో మంగళవారం టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ కు తొలి అక్రిడిటేషన్ కార్డ్ ను అందజేసి కలెక్టర్ స్నేహశబరీష్ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంబించారు. అనంతరం జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు నవాబ్, బిక్షంగౌడ్, గాడిపల్లి శ్రీహరి, అయోధ్యరామయ్య, రంగాచౌదరి లకు జిల్లాకలెక్టర్ స్నేహశబరీష్ స్వయంగా కార్డ్ లను అందజేసారు. అనంతరం జర్నలిస్ట్ ల సమస్యలు, జిల్లా లోని పలు అంశాలపై కొంతసేపు చర్చించారు. జర్నలిస్టు లకు అక్రిడిటేషన్ కార్డ్ ల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ చూపిన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహశబరిష్ కు టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ.. కార్యక్రమంలో డిపిఆర్వో రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
బుధవారం 27.05.2026
www.mudranews.in | @mudranews

8 పశ్చిమ తెలంగాణ
మెదక్, నిజామాబాద్
Medak, Nizamabad

**టీ మానేయడం వల్ల కలిగే ప్రయోజనాలు**

ఒత్తిడి నుండి ఉపశమనం :
కెఫిన్ అలవాటు తప్పడం వల్ల గుండె వేగం, రక్తపోటు నియంత్రణలో ఉండి శరీరం రిలాక్స్ అవుతుంది. ఇది మానసిక ఆందోళనలను తగ్గించి, రోజంతా మిమ్మల్ని ఒత్తిడి రహితంగా ఉంచుతుంది.



# ఉపాధ్యాయురాలి కులం సర్టిఫికెట్ రద్దు

**- ఉద్యోగం కోల్పోయిన బాధితుడి ఫిర్యాదు**
**- విచారణ కమిటీ నివేదికతో రద్దు చేస్తూ కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉత్తర్వులు**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలి కులం సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ రద్దు చేస్తూ మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. బీసీ –ఈ కులం సర్టిఫికెట్ తో టీచర్ ఉద్యోగం పొందగా, ఉద్యోగం దక్కని మరో అభ్యర్థి ఫిర్యాదుతో అధికారులు విచారణ జరిపి ఇచ్చిన నివేదిక ఆధారంగా కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇవి.. 2024 డీఎస్సీలో బీసీ– ఈకి 5 ఎస్జీటీ పోస్టులు కేటాయించారు. టేక్మాల్ మండలం తంపులూరు గ్రామానికి చెందిన కుమారి సనా బేగం బీసీ –ఈ క్యాస్ట్ సర్టిఫికెట్, నాన్ క్రిమిలేయర్ ఆధారంగా టీచర్ ఉద్యోగం పొంది అదే గ్రామ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. కాగా ఆమె బీసీ –బి కాగా, నిబంధనలకు విరుద్ధంగా బీసీ –ఈ తప్పుడు క్యాస్ట్ సర్టిఫికేట్ తో ఉద్యోగం పొందినట్లు పాపన్నపేట మండలం కొత్త లింగాయపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ నవాజ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా స్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేయగా, సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి కలెక్టర్ కు నివేదిక అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ ప్రతిమా సింగ్ సనా బేగం క్యాస్ట్ సర్టిఫికెట్, నాన్ క్రిమీ లేయర్ సర్టిఫికెట్ రద్దు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 30 రోజులలోపు ఈ ఉత్తర్వుపై ప్రభుత్వానికి అప్పీలు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

**ఏడాదిన్నర నుండి బాధితుడి పోరాటం**

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించడంతో ఉద్యోగం కోల్పోయిన బాధితుడు ఏడాదిన్నర నుండి పోరాటం చేశాడు. అన్ని ఆధారాలతో కలెక్టర్ ను ఆశ్రయించి న్యాయం కోసం ప్రయత్నం చేశాడు. పాపన్నపేట మండల పరిధిలోని కొత్త లింగాయిపల్లికి చెందిన మహ్మద్ నవాజ్ బిసి–ఈ (షేక్) కులం. డీఎస్సీ- 2024 ఎస్జీటి ఉద్యోగానికి పరీక్ష రాసి 61.17 మార్కులతో 235వ ర్యాంక్ సాధించాడు. బిసి–ఈ క్యాటగరీలో ఉద్యోగం పొందడానికి పూర్తి అర్హతలు కలిగి ఉన్నప్పటికీ ఇదే క్యాటగిరిలో తన ముందున్న అభ్యర్థినికి అధికారులు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడంతో ఉద్యోగం కోల్పోయానని ఆవేదనకు గురయ్యాడు. బీసీ–ఈ కేటగిరి మెరిట్ లో తన ముందున్న టేక్మాల్ మండలానికి చెందిన ఓ అభ్యర్థి తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం పొంది ఉద్యోగం సాధించిందని ఫిర్యాదు చేశాడు. ఇదే విషయమై పలుమార్లు జిల్లా అధికారులకు విన్నవించాడు.

**ఇష్టారాజ్యాంగ కుల ధ్రువీకరణ**

కుల దృవీకరణ పత్రం జారీలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. 2018 మే 19న సదరు అభ్యర్థినికి బిసి–బి (దూదేకుల) కుల ధ్రువీకరణ పత్రం జారీ చేసిన తహశీల్దారు అదే సంవత్సరం 2018 ఆగస్టు 1న అదే తహసీల్దారు బీసీ–ఈ (షేక్) కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయడం అధికారుల నిర్లక్ష్యం స్పష్టం అవుతోంది. ఈ నిర్లక్ష్యం వల్ల తాను ఉద్యోగం కోల్పోయానని నవాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తప్పుడు సర్టిఫికెట్ అని తేలడంతో తనకు ఉద్యోగం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

## అర్హులకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు

**కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** జిల్లాలో అర్హులైన వారికి ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అందించాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు అయినా టూవీలర్, త్రీ వీలర్, సోలార్ పంప్ సెట్, వివిధ పథకాలకు నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. గతంలో జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 1600 మంది దరఖాస్తు చేసుకున్నారని, జిల్లా లక్ష్యం 247 గా ఉందన్నారు. పారదర్శకంగా రుణాలు మంజూరు చేసేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. అర్హతగల నిజమైన లబ్ధిదారులకు మాత్రమే కార్పొరేషన్ సబ్సిడీ రుణాల అందించాలని అధికారులకు సూచించారు. ఈ నెల 31 వరకు అన్ని దరఖాస్తుల స్క్రూటీనీ పూర్తి చేసి ఆన్ లైన్ ద్వారా లబ్ధిదారుల వివరాలను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. ఈ గూగుల్ మీట్ లో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు..**

జిల్లాలో ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు లెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. 2,65,639 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. 54,885 మంది రైతుల నుండి కొనుగోలు చేసి 38,402 మంది రైతుల అకౌంట్లో 423,52 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన అధికారులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

## మెదక్ జిల్లా బీసీ అధికారిగా ఉపేందర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ బీసీ అభివృద్ధి, సంక్షేమ శాఖ అధికారిగా కే. ఉపేందర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన కమిషనరేట్ నుంచి మెదక్ జిల్లా కు బదిలీపై వచ్చారు.

కలెక్టరేట్ ప్రతిమా సింగ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందించారు. జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ సూచించారు.


# కవిత సుతారి మేస్త్రీలకు క్షమాపణ చెప్పాలి

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**
టీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల కవిత వెంటనే సుతారి మేస్త్రీలకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ సుతారి సంఘం అధ్యక్షుడు ధరిపల్లి చంద్రం డిమాండ్ చేశారు. సెంట్రింగ్ కార్మికుల మహాసభకు వెళ్లిన కవిత సుతారి హటావో... సెంట్రింగ్ కో బచావో అని వ్యాఖ్యానించడాన్ని నిరసిస్తూ మంగళవారం సిద్దిపేట గాంధీ విగ్రహం వద్ద భవన నిర్మాణ రంగ కార్మికులు ఆమె దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో పలువురు సుతారి మేస్త్రీలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ టీఆర్ ఎస్ అధినేత కవిత సుతారీ కార్మికులను ఉద్దేశ్యంచి అవమాన పర్చాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సెంట్రింగ్ కార్మికులకు మద్దతు పలకడం తప్పు కాదని, కాని మేస్త్రి హటావో సెంట్రింగ్ బచావో అంటూ వ్యాఖ్యలు చేయడం సిగ్గు చెటన్నారు. గుండు దారం, లేకుండానే బిల్డింగు కట్టగలరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కవిత తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని సుతారి మేస్త్రీలకు క్షమాపణలు చెప్పకపోతే 14 రకాల కార్మికులంతా ఏకమై పోరాటం చేస్తామని హెచ్చరించారు.



## పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

**ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు**




**ముద్ర ప్రతినిధి, మెదక్:** చిన్న శంకరంపేట్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న రికార్డులు, పెండింగ్ కేసులు, నేర నియంత్రణ చర్యలు, సిబ్బంది విధి నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను సమీక్షించిన ఎస్పీ.. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చేపడుతున్న చర్యలపై కూడా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. సీఐలు సైదా, సందీప్ రెడ్డి, ఎస్సై శివానందం సిబ్బంది ఉన్నారు.

**బక్రీద్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి**

బక్రీద్ పండుగ నేపథ్యంలో మెదక్ టౌన్ పరిధిలోని భోదన్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్టును మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీ విధానం, రికార్డుల నిర్వహణ, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అక్రమ రవాణా లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ హెచ్చరించారు. సీఐ మహేష్, సిబ్బంది ఉన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన



**ముద్ర, కోరుట్ల:**
ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం కోరుట్ల మండలం కల్లూరులో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెట్టు పల్లి ఐసీడీఎస్ సీడీపీఓ మనెమ్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి ఆరుట్ల రజిత ప్రజలకు బాల్య వివాహాల పై అవగాహన కల్పించారు. బాల్య వివాహ చట్టం – 2006, పోక్సో చట్టం –2012, మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం– 2006 ప్రకారం 18 సంవత్సరాల లోపు అమ్మాయికి, 21 సంవత్సరంలోపు అబ్బాయికి వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అందుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తామన్నారు, అదేవిధంగా బాల్య వివాహాల వల్ల పిల్లలకు భవిష్యత్తులో మానసిక, శారీరక ఎదుగుదల ఆగిపోతుందన్నారు. అలాగే ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు వర్తించవన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పిల్లలకు సమస్య ఉంటే ఈ కమిటీ దృష్టికి తీసుకురావాలని కోరారు. బాలబాలికలు మత్తు కు బానిస కావద్దని, మొబైల్ ఫోన్స్ కి దూరంగా ఉండాలని సూచించారు. చైల్డ్ హెల్ప్ లైన్1098 పోలీస్ 100, సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ సీడీపీఓ మనెమ్మ, సూపర్వైజర్ లు సఖి, లావణ్య, హబూ, హేమ, ఔట్ రీచ్ వర్కర్ శేఖర్, అంగన్వాడీ టీచర్ లు పాల్గొన్నారు.

**ఉత్తర తెలంగాణ వార్తలు..**

# కొనుగోలు కేంద్రాల్లో వసతుల కల్పించాలి

**- కలెక్టర్ రాజర్షిషా**



**బోథ్, ముద్ర:**
ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వసతుల కల్పించాలని చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డ్‌ను సందర్శించారు. క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు వస్తున్న పంట దిగుబడులు, కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లతో పాటు గోదాంలకు తరలించే రవాణా ప్రకియ వేగవంతం చేయాలన్నారు.మార్కెట్ యార్డ్‌కు పంటను తీసుకు వచ్చే రైతులకు తాగునీరు, నీడ వంటి కనీస మౌలిక వసతుల కల్పనలో లోపాలు ఉండకూ డదని అధికారులను ఆదేశించారు. పంట కొనుగోలు ప్రక్రియ పారద ర్శకంగా సాగాలన్నారు. తూకాల్లో ఎలాంటి వ్యత్యాసాలు రాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే కొనుగోలు చేసిన పంటను సకాలంలో గిడ్డంగులకు తరలించేలా రవాణా చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఈ తనిఖీలో మండల ప్రత్యేక అధికారి రామారావు, తహసీల్దార్ ఇమ్రాన్, ప్యాక్స్ చైర్మన్ ఏ. శ్రీకాంత్ రెడ్డి, సర్పంచ్ జె.జాకు, స్థానిక మార్కెట్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడొద్దు

**బోథ్, ముద్ర:**
అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఆర్ డీఎస్పీ కే. ఇంద్రవర్ధన్ హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోనాల మండలం గుట్టపక్క తండాలో మంగళవారం ఉదయం బోథ్ సీఐ గురుస్వామి, ఎస్ఐ వి. పురుషోత్తం సమక్షంలో కార్డన్ సెర్చ్ చేపట్టారు. ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 2 ఆటోలు, 28 ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. అందులో నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న నాలుగు బైకులను గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా నార్కోటిక్ జాగిలం రోమా తనిఖీలు నిర్వహించగా అందులో ఓ వ్యక్తి నుంచి 120 గ్రాముల గంజాయిని జాగిలం గుర్తించినట్లు చెప్పారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పెండింగ్ లో ఉన్న 15 వాహనాల చలానాల ద్వారా రూ.16,750 జరిమానా వసూలు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం ఇలాంటి కార్డెన్ సెర్చ్ నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు.




## ఎడ్ల బండిపై సుడా చైర్మన్ నిరసన

**సుడా కార్యాలయానికి ఎడ్లబండిపై సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**ముద్ర, కరీంనగర్ :** రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలకు నిరసనగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఎడ్ల బండి పై ఇంటి నుండి సుడా కార్యాలయానికి వెళ్లారు.ఎడ్ల బండి నడుపుకుంటూ వెళ్తూ మార్గ మధ్యలో ఆగుకుంటూ ప్రజలతో పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని వివరించారు. సుడా కార్యాలయానికి చేరుకున్న అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్లో పాయిజన్ ఇచ్చినట్టు రోజు రోజుకు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యుడు జీవితం పై తీవ్ర భారం మోపుతున్నారని దీని వల్ల అన్నిటిపై ప్రభావం పడి ధరలు పెరుగుతాయని అన్నారు. గతంలో యుపిఎ ప్రభుత్వం హాయంలో అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర ఇప్పుడున్న దానికంటే ఎక్కువ ఉన్నా ఆరోజు అరవై రూపాయలకు అందించిందని వెంటనే పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని లేకపోతే వాహనాలలో తిరిగే పరిస్థితి లేదని అందుకే నేను ఎడ్ల బండి పై ఆఫీసుకు వచ్చానని చెప్పారు. ధరలు దించే వరకు వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మల్లిఖార్జున రాజేందర్, పర్వతం మల్లేశం,జగన్ రెడ్డి,గుండటి శ్రీనివాస్ రెడ్డి,పిట్టల రవీందర్,సుదర్శన్, శ్రీధర్ రెడ్డి,పటేల్ శ్రీనివాస్ రెడ్డి,కాంపెల్లి కీర్తి కుమార్,గడమళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013.Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com